■ ఇంటర్వ్యూ



పోలైన సర్వీస్ ఓట్లు 19503



మహిళావర్శిటీ వద్ద ఓటేసేందుకు ఫామ్ నింపుతున్న ఉద్యోగినులు

తిరుపతి, చంద్రగిరిపై ప్రత్యేక దృష్టి

- ఏఎస్‌డీ సిస్టమ్‌తో దొంగ ఓటింగ్‌కు చెక్
- అంగన్‌వాడీ వర్కర్లకు పోస్టల్ బ్యాలెట్
- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), మే 6 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన ఆంధ్రజ్యోతితో వివరంగా మాట్లాడారు. ఈ రెండు నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో పాటు గత ఎన్నికల్లో అక్కడ చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని మొత్తం 671 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అదనపు కేంద్ర సాయుధ బలగాలను కూడా నియమిస్తున్నామని, పోలింగ్ నాడు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లావ్యాప్తంగా కూడా 711 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.13న జరగనున్న పోలింగ్‌కు సామాగ్రిని కూడా ఆయా నియోజకవర్గాలకు తరలించామని చెప్పారు. మరో మూడు రోజుల్లో స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చుతామన్నారు.ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎచలువపందిళ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాన్ని మ్యాపింగ్ చేసి దగ్గర్లో వున్న పీహెచ్‌సీకి అనుసంధానం చేస్తున్నామన్నారు. ఎవరైనా ఓటరు అస్వస్థతకు గురైతే తక్షణం పీహెచ్‌సీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏఎస్‌డీ సిస్టమ్‌తో దొంగ ఓట్లకు చెక్

ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఓటరు స్లిప్పులను ఇంటింటికీ బీఎల్వోల చేత పంపిణీ చేయిస్తున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఎల్వో కాకుండా ఏ ఒక్కరి చేతికి ఎన్నికల స్లిప్పులు వెళ్లాయని తెలిసినా కఠిన చర్యలుంటాయన్నారు. దొంగ ఓట్లను అరికట్టడానికి ఏఎస్‌డీ (అబ్సెంటీ, షిఫ్టెడ్, డెత్)లిస్టును బీఎల్వోలకు అందజేయడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఓటరు స్లిప్పులు అందజేసే క్రమంలో సంబంధిత చిరునామాలో లేనివారు, చనిపోయిన, షిఫ్ట్ అయిన వారి వివరాలు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. 8వ తేదీకి పూర్తిస్థాయిలో ఓటర్లు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. అయితే పోలింగ్ నాడు షిఫ్ట్ అయిన , చనిపోయిన వారి పేరుతో ఓటు వేయడానికి ఎవరైనా వస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. బీఎల్వో వచ్చినపుడు ఇంట్లో లేకుండా బయటకు వెళ్లిన వారు పోలింగ్ నాడు ఎపిక్‌కార్డు, కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తీసుకుని వచ్చి ఓటు వేయవచ్చన్నారు.

అంగన్‌వాడీలకు పోస్టల్ బ్యాలెట్

పోలింగ్ విధులకు ఈసారి జిల్లాలో 1,800మంది అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా తీసుకున్నామని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.వారు రిజర్వులో వుంటారని, అత్యవసర సమరంలో వినియోగిస్తామన్నారు.

సత్యవేడులో పోలింగ్ కేంద్రం వద్దే నగదు పంపిణీ

సూళ్ళూరుపేటలో ప్రలోభాలకు వైసీపీ యత్నాలు

తిరుపతి పోలింగ్ సిబ్బందికి నాసిరకం భోజనాలు

రెండవరోజు పోలైన ఓట్లు

సెగ్మెంట్	ఎలక్షన్ డ్యూటీ ఓటర్లు	ఎమర్జెన్సీ సర్వీసుల ఓటర్లు	రెండు రోజుల్లో మొత్తం	
గూడూరు	1050	032	2103	057
సూళ్ళూరుపేట	0650	024	1565	031
వెంకటగిరి	0406	035	1646	051
తిరుపతి	1024	049	3124	090
శ్రీకాళహస్తి	0560	033	2121	069
సత్యవేడు	0356	071	1103	103
చంద్రగిరి	1251	054	3051	105
ఇతర జిల్లాల	1355	243	3833	451
మొత్తం	6652	541	18546	957



సత్యవేడులో ఓటర్లకు డబ్బులు పంచుతున్న వైసీపీ కార్యకర్తలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అత్యవసర సర్వీసుల ఉద్యోగులకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో రెండవ రోజు ఓటర్లు తగ్గుముఖం పట్టారు. తొలిరోజైన సోమవారం 12,310 మంది ఉద్యోగులు ఓటు వేయగా రెండవ రోజైన మంగళవారం 7193 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూళ్ళూరుపేటలో పోలింగ్ కేంద్రం వెలుపల వైసీపీ నేతలు హల్‌చల్ చేశారు. ఓటు వేయడానికి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులను, అంగన్‌వాడీ వర్కర్లను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నించారు.దీనిపై ఫిర్యాదులు అందడంతో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి చేరుకుని వైసీపీ నేతలను పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల అవతలకు పంపించివేశారు. సత్యవేడులో పోలింగ్ కేంద్రం వెలుపలే వైసీపీ, టీడీపీ నేతలతో పాటు ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు బహిరంగంగా పోటాపోటీగా నగదు పంపిణీ చేశారు. వైసీపీ నేతలు తమకు ఓటు వేస్తారన్న నమ్మకం వున్న ఉద్యోగులకు రూ. 2 వేల వంతున పంపిణీ చేశారు. ఇక టీడీపీ నేతలైతే ఎక్కువ మంది ఉద్యోగులకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేయగా ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు మాత్రం ప్రధాన పార్టీల కంటే అధికంగా ఓటుకు రూ. 2500 చొప్పున నగదు పంపిణీ చేశారు. ముగ్గురు అభ్యర్థులకు చెందిన అనుచరులూ ఓటర్ల జాబితాలు పెట్టుకుని నగదు అందజేసి ఆయా పేర్లను టిక్ చేసుకుంటూ బిజీగా గడిపారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు.

తిరుపతిలో షరా మామూలుగా వివాదాలు

తిరుపతి పోలింగ్ కేంద్రంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓటు వేయడానికి ద్విచక్ర వాహనంలో రాగా బీఎస్‌ఎఫ్ సిబ్బంది అడ్డుకుని గుర్తింపు కార్డు చూపాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగి బీఎస్‌ఎఫ్ ఎస్‌ఐ ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నారు. అక్కడే వున్న క్రైమ్ సీఐ కళా వెంకట్రమణ జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని అధికారులు ముందే ప్రకటించినా పలువురు ఉద్యోగులు, అధికారులు మొబైల్ ఫోన్లతో వచ్చారు. బీఎస్‌ఎఫ్ సిబ్బంది అడ్డుకోగా వారితో వాగ్వాదానికి దిగారు. ఇండిపెండెంట్ అభ్యర్థి రంగూన్ శంకర్ తన పేరిట స్టిక్కర్ కారుకు అంటించుకుని పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వెళుతుండగా బీఎస్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు.తిరుపతి నియోజకవర్గ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఆకలితో అలమటించిన సిబ్బంది రెండవ రోజు నాసిరకం భోజనాలతో ఇబ్బంది పడ్డారు. సోమవారం రాత్రి భోజనం అర్ధరాత్రి అందజేయగా మంగళవారం భోజనాలు నాణ్యంగా లేవు. వాటర్ బాటిళ్లు కూడా సక్రమంగా అందించలేదు. చల్లటి నీరు పెట్టినా తక్కువగా పెట్టారు. మజ్జిగ ప్యాకెట్లు కూడా చాలీచాలకుండా అందజేశారు. టాయిలెట్ సదుపాయం కూడా సరిగా లేదు. దీంతో పోలింగ్ సిబ్బంది అవస్థ పడ్డారు.



ట్రాఫిక్ కానిస్టేబుల్, బీఎస్‌ఎఫ్ సిబ్బంది వాగ్వాదం

హోం ఓటింగ్‌కు విశేష స్పందన

తిరుపతి(కలెక్టరేట్), మే 6 : దివ్యాంగులతో పాటు 85ఏళ్లు దాటిన వయోవృద్ధులకోసం ఈసీ ఏర్పాటు చేసిన హోం ఓటింగ్‌కు స్పందన బాగానే వుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,139మంది దరఖాస్తు చేసుకోగా సోమవారం 955మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా అధికారులు తెలిపారు. మంగళవారం కూడా మిగిలిన ఓటర్ల ఇళ్ల వద్దకు పోలింగు సిబ్బంది వెళ్లి ఓటు వేయించనున్నారు.ఇద్దరు పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్, పోలీసుశాఖనుంచి ఒకరు హోంఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లాలో హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారిసంఖ్య 1,139మంది కాగా మొదటిరోజు 955మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే రెండవరోజు మంగళవారం మిగిలినవారికి హోంఓటింగ్‌కు వినియోగించుందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తిరుపతిలో హోంఓటింగ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్, ఆర్వో



ఇంజనీరింగ్ కళాశాలలో వైసీపీ ప్రచారం



విజయసాయిరెడ్డి మాస్కులతో విద్యార్థినులు

విద్యార్థులకు సాధికారత, స్థిరత్వంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి హాజరయ్యారు. అయితే సమావేశంలో విద్యార్థినీ, విద్యార్థులు విజయసాయిరెడ్డి మాస్కులను ధరించడం, వేదికపై ఓ అధ్యాపకుడు విజయసాయికి ప్రచారం చేయడం, దిశ చట్టానికి చెందిన ఓ సభ్యురాలు జై జగన్, జై జగన్ అంటూ నినాదాలు చేయడం, వైసీపీ ప్రచారానికి సంబంధించిన పాటలను ప్లే చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలు, ఉన్నత విద్యకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించాలే గానీ ఇలా ఓ రాజకీయపార్టీకి వేదికగా మార్చడం ఎంతవరకు సమంజసమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

- గూడూరు అర్బన్

ఫ్యానూ లేదు గాలీ లేదు !

జగన్ ఊదరగొడుతున్న సంక్షేమం అంతా శుద్ధ డ్రామా. నిజానికి రాష్ట్రంలో ఫ్యానూ లేదు, గాలీ లేదు.2019లో కూడా వైఎస్ బొమ్మతో జగన్ గెలిచాడు తప్ప సొంత శక్తితో కాదు.పరదాల మాటున తిరిగే జగన్ ఈసారి ఓడిపోవడానికి సిద్ధం అయ్యారు. ప్రధానికి కూడా లేనంతమంది సలహాదారులను పెట్టుకున్నారే.జాబ్ క్యాలెండర్ , డీఎస్సీ నోటిఫికేషన్‌పై వారెందుకు సలహా ఇవ్వలేదో చెప్పాలి.నిరుద్యోగుల ఆగ్రహానికి వైసీపీ బలికాక తప్పదు. ఈసారి కూటమికి 136 అసెంబ్లీ, 21 పార్లమెంటు స్థానాలు వస్తాయి.ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో క్లీన్ స్వీప్ ఖాయం. అన్నింటా తన బొమ్మలు వేసుకుంటున్న జగన్ చివరికి సమాధిపైనా వేసుకుంటాడేమోనని నా అనుమానం.అయినా చెల్లి కట్టుకున్న పసుపు చీరపైనా కామెంట్ చేసిన జగన్ గురించి ఏం మాట్లాడతాం?

- తిరుపతిలో ప్రచారం సందర్భంగా నటుడు పృథ్వీరాజ్



ఓటుకు రూ.2వేలు

తిరుపతిలో ప్రధాన పార్టీల నగదు పంపకాలు షురూ

తిరుపతి,మే 6 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు వారం రోజుల గడువుండగానే తిరుపతిలో నగదు పంపకాలు మొదలయ్యాయి. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఓటుకు రూ.2వేల చొప్పున అందజేస్తున్నారు. పోలింగ్‌కు ముందు మళ్లీ తాయిలాలుంటాయని కూడా చెబుతూ..తమకే ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రధాన పార్టీల వార్డు స్థాయి నాయకులను పక్కన పెట్టుకుని అభ్యర్థుల ముఖ్య అనుచరులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు డబ్బులు ఇస్తున్నారు. కొన్ని చోట్ల ఒక చోట తిష్టవేసి ఓటర్లకు ఫోన్లు చేసి పిలిపించుకుని ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే అన్ని రూ.2వేలు చొప్పున ముట్టచెబుతున్నారు. నిజానికి తొలుత రూ.500 చొప్పున పంచుదామని ఒక పార్టీ భావించింది. అయితే ప్రత్యర్థి పార్టీ ఒకేసారి రూ.2వేలు పంపిణీకి రంగం సిద్ధం చేయడంతో తప్పని పరిస్థితుల్లో బడ్జెట్‌ను పెంచుకున్నారు. నగదు తీసుకోనివారికి ఖరీదైన గిఫ్టులు కూడా ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సంఘాల సభ్యులకు మందు పార్టీలు ఇచ్చి మత్తులో ముంచుతున్నారు.అందుబాటులో లేనివారికి, కొన్ని కాలనీలకు ఆన్‌లైన్ పేమెంట్లు చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు కో-ఆర్డినేటర్లను నియమించుకున్నట్టు తెలుస్తోంది. లక్ష రూపాయలకు మించకుండా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు బదిలీ అవుతున్నట్టు సమాచారం. ఒక్కో ఏజెంటు దాదాపు వంద మందికి పైగా ఓటర్లను సమీకరించి యూపీఐ యాప్‌ల ద్వారా నగదు బదిలీ చేస్తున్నట్టు సమాచారం.

● ప్రచార పర్వంలోనూ కరుగుతున్న మూటలు

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచాయి. ఇంటింటి ప్రచారంలోనే పార్టీల ప్రచార బలం కనిపిస్తోంది. తిరుపతిలో ఒక్కో డివిజన్‌కు లక్ష రూపాయల చొప్పున రోజూ ఆయా రాజకీయ పార్టీలు డివిజన్ ఇన్‌చార్జికి ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. డివిజన్‌కు సరాసరిగా 5 బూత్‌లు ఉంటే ఒక్కోబూత్‌కు రూ.20వేలు చొప్పున ఇవ్వాల్సి వస్తోంది. బూత్ ఇంచార్జులు రూ.300 నుంచి రూ.600 వరకు ఇచ్చి 30మంది ప్రచారకర్తలను పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కలిపి రెండు గంటల పాటు జెండా పట్టుకుని ప్రచారం చేస్తారు. కొన్ని బూత్‌ల్లో అయితే ఒక పూటతోనే సరిపెట్టేసి ప్రచార కర్తలకు రూ.300 మాత్రమే ఇచ్చి మిగిలింది జేబులో వేసుకుంటున్నారు.

రేణిగుంటలో వలంటీర్ల సహకారం

రేణిగుంట, మే 6 : రేణిగుంట పట్టణంలో అయితే ప్రచారంలోనే నగదు పంపిణీ కూడా జరిగిపోతోంది.సోమవారం సాయంత్రం వైసీపీ నాయకులు రాజీనామా చేసిన వలంటీర్లు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. వలంటీర్లు చూపించిన ఇళ్లలోకి వెళ్లి డబ్బులు పంచారని సమాచారం.



తిరుపతిలో నేడు బాబు, పవన్ రోడ్‌షో

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు తిరుపతిలో రోడ్‌షో నిర్వహించి బహిరంగసభలో పాల్గొననున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లా పుంగనూరు వెళ్లి ఎన్నికల సభలో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌లో బయల్దేరి 6.10 గంటలకు తిరిగి రేణిగుంటలోని విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచీ రోడ్డు మార్గాన తిరుపతి చేరుకుని లీలా మహల్ కూడలి నుంచీ దేవేంద్ర థియేటర్, మున్సిపల్ కార్యాలయ కూడలి మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకూ రోడ్‌షోలో పాల్గొంటారు. రాత్రి 7 నుంచీ 8.30 గంటల వరకూ అక్కడ జరిగే ఎన్నికల బహిరంగసభలో పాల్గొంటారు. సభ ముగించుకుని రాత్రి 9 గంటలకు హైదరాబాదు బయల్దేరి వెళ్ళనున్నారు. పవన్ కళ్యాణ్ కూడా మంగళవారం సాయంత్రం రాజమండ్రి నుంచీ విమానంలో బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. అక్కడి నుంచీ చంద్రబాబుతో కలసి తిరుపతి రోడ్‌షో, బహిరంగసభల్లో పాల్గొని రాత్రికి హైదరాబాదు వెళ్లనున్నారు. ఎన్‌డీఏ కూటమిలో రెండు ప్రధాన పార్టీల అధినేతలూ కలసి రోడ్‌షో, ఎన్నికల బహిరంగసభలలో పాల్గొననుండడంతో ఆ మేరకు టీడీపీ, జనసేన పార్టీల్లో జోష్ పెరిగింది. అధినేతల పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు పార్టీల నేతలూ భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.



టీడీపీలో వైసీపీ నేతల చేరిక


ప్రచారం చేస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 6: తిరుపతి రూరల్ మండలంలో సి.గొల్లపల్లె, కుంట్రపాకం, పాతకాల్వ, మంగళం పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ నేతలు సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపుకోసం దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు మనోహర్‌రెడ్డి, చెంగారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మురళిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఈశ్వరయ్య, మణి, గోపీనాథ్, శ్రీనివాసులు, బాలాజి, చంద్ర, ప్రకాష్‌రెడ్డి, చిరంజీవి, శివ, విజయ్, జనసేన రూరల్ మండల వైస్‌ప్రెసిడెంట్ హరీష్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

వారంలో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు

- హెచ్‌ఆర్సీ మహిళా అధ్యక్షురాలు లావణ్య



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: రాబోయే వారం రోజుల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు కానుందని పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఏపీ మహిళా అధ్యక్షురాలు లావణ్య పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి సీఎం జగన్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా ఆపి వేసిన ఈ చట్టం ఎన్నికల తర్వాత అమలుచేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజలను అన్ని రకాలుగా పీడించిన వైసీపీ, ప్రస్తుతం భూములపై పడ్డారని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో పాటు భవిష్యత్తులో గోల్డ్, వెహికిల్ యాక్ట్‌లు తెచ్చినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి కూటమిని గెలిపించడమే ఈ సమస్యలన్నింటికీ తగిన పరిష్కారమని ఆమె స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం


కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), మే 6: రాష్ట్రంలోనే తిరుపతిని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచిన మాజీ కేంద్ర మంత్రి, తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్‌కు ఓటు వేసి గెలిపించాలని నగర పార్టీ అధ్యక్షుడు యార్లపల్లి గోపీ అన్నారు. సంజయ్‌గాంధీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భానుప్రకాష్, నాగరాజు, షేక్ జావేద్, శాంతి యాదవ్, మునిశోభ, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

శేషాచల అడవులకు నిప్పు



మంగళం, మే 6: మంగళం సమీపంలోని ఎస్‌ఐసీ బిల్డింగ్‌కు ఆనుకుని ఉన్న శేషాచల అడవులకు నిప్పు అంటుకుంది. సోమవారం మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతం మొత్తం ఎండుగడ్డి కావడంతో మంటలు వ్యాపించాయి. దాదాపు మూడు కిలోమీటర్ల మేర మంటలు వ్యాపించాయని, వాటిని ఆర్పివేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ మంటలకు కారణం ఆకతాయిలు నిప్పుపెట్టి ఉంటారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

టీడీపీ గెలిస్తేనే ఉద్యోగాలు


ప్రచారం నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

చంద్రగిరి, మే 6: రాష్ట్రంలో టీడీపీ గెలిస్తేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ నాయకుడు వడ్లమూడి సారథి నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, హరిజనవాడ తదితర గ్రామాల్లో టీడీపీ తరపున ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఐలు శాఖమూరి దామోదరం, నర్రాలవుల దేవరాజ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల స్థానికులకు భూమన చేసిందేమిటి?

బాలాజీనగర్ వాసులకు పక్కా ఇళ్లు అటకెక్కించారు

స్థానికులకు స్వామి దర్శనం లేకుండా చేశారు

అయినవారికే అనధికార తట్టలిచ్చారు

శ్రీవాణి పేరుతో దోచుకుంటున్నారు

టీడీపీ రాయలసీమ మీడియా కన్వీనర్ శ్రీధర్‌వర్మ

ఫటాఫట్!



ఎన్టీఆర్ రాజు అంటే ఒక బ్రాండ్. దివంగత నేత నందమూరి తారక రామారావు ఆయనకు ఆరాధ్య దేవుడు. ఎన్టీఆర్‌ను తన ఇంటిపేరుగా మార్చుకున్న ఆయన కుమారుడు శ్రీధర్ వర్మ. నాన్నతో కలసి వేసిన తొలి అడుగులు టీడీపీతో గాఢమైన అనుబంధంగా మారాయి. నారా, నందమూరి కుటుంబాలకు వీరవిధేయుడు. తిరుమలవాసి. ప్రస్తుతం టీడీపీ రాయలసీమ మీడియా కన్వీనర్‌గా చురుకైన పాత్ర పోషిస్తూ, ఎన్డీఏ కూటమి విజయం కోసం సీమ మొత్తం విస్తృతంగా తిరుగుతున్న శ్రీధర్ వర్మతో ఫటాఫట్ ఇంటర్వ్యూ..

? ఈఎన్నికల్లో తిరుమల, తిరుపతి స్థానికుల మద్దతు ఏ పార్టీకి ఉంటుంది.

! స్థానికులందరు టీడీపీ కూటమికే మద్దతు తెలుపుతున్నారు. వైసీపీ తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయరెడ్డి స్థానికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఏదైనా సమస్యలను వారి దృష్టికి తీసుకువెళితే సానుకూలంగా స్పందించిన సందర్భాలు చాలా తక్కువ. తిరుమలలోని బాలాజీనగర్‌లో నివాసముంటున్న స్థానికులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు హీరో చిరంజీవి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టీటీడీ బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఇప్పటివరకు పక్కా ఇళ్ల నిర్మాణం జరగలేదు. కనీసం రేకులు తొలగించి, స్లాబ్ వేసుకునేలా కూడా అనుమతి ఇవ్వలేదు. వీళ్లు ఇవ్వనివ్వడం లేదు. ఇదీ స్థానికులపై వీళ్ల దోరణి. ఇక స్వామి దర్శనాలు క్రమపద్ధతిలో జరగడం లేదు. శ్రీవాణి ట్రస్టు పేరుతో భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. రోజుకి ఎంత ఆదాయం వస్తుందో తగిన లెక్కచూపని పథకం అది. ఆ నిధులతో ఆలయాలు నిర్మిస్తున్నామని, మరమ్మతులు చేస్తున్నామని తప్పుడు సమాచారాన్ని పెడుతున్నారు. నిజానికి ఈ నిధులను ప్రభుత్వం కాజేస్తోంది. ఇవన్నీ తెలిసిన స్థానికులు, ఇదే ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకోవడం లేదు.

? తిరుమలలో తట్టల అంశం ఈ మధ్య వివాదంగా వినిపిస్తోంది.

! అవును నిజమే. అక్రమంగా, అనధికారికంగా ఎలాంటి లైసెన్సు లేకుండా 80కిపైగా తట్టలు పెట్టారు. ఎమ్మెల్యే, ఆయన కుమారుడూ తమ పార్టీ అభిమానులను హాకర్లుగా గుర్తించి, తట్టలు పెట్టించారు. అనుచరులు, అభిమానులపై ఉన్న ప్రేమను స్వామి పాదాల చెంత జీవిస్తున్న అసలైన స్థానికులపై చూపలేదు. అనధికార తట్టలతో స్వామి ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

? తిరుమల వ్యాపారుల మద్దతు తమకే అని వైసీపీ బలంగా చెబుతోంది.

! బెదిరించి తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. ఉదాహరణకు జనసేనకు చెందిన మురళిని బలవంతంగా వైసీపీలోకి చేర్చుకున్నారు. విజిలెన్స్ అధికారులతో అతని షాప్‌ను సీజ్ చేయించారు. వైసీపీలోకి చేరిన తర్వాత తిరిగి షాప్‌ను ఇచ్చారు. మురళి.. సినీనటుడు చిరంజీవికి సన్నిహితుడు కావడంతో ఆయన ప్రమేయంతో మురళి తిరిగి జనసేనలో చేరారు. ఇలాంటివి తిరుమలలో చాలానే జరిగాయి. చిరు వ్యాపారుల నుంచి దుకాణాలు నడుపుకునే చాలా మందిని ఇలాగే బెదిరించి పార్టీలో చేర్చుకున్నారు.

? మీరు గెలిస్తే స్థానికులకు దర్శనం అవకాశం కల్పిస్తారా.

! గత టీడీపీ ప్రభుత్వం ప్రతి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఈ విధానాన్ని తిరిగి ప్రారంభిస్తాం. తిరుమల ఖ్యాతి ప్రపంచస్థాయికి వెళ్లిందంటే అందులో తిరుమల స్థానికుల ప్రమేయం కూడా ఉంది. స్థానికులు ఉంటేనే తిరుమల ఉంటుంది. స్థానికులకు తగిన ప్రాధాన్యం ఇస్తేనే ఈప్రాంతం మరింత అభివృద్ధి జరుగుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

46లో 16 భూమన తరపు నామినేషన్లే

- టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు ఆరోపణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: తిరుపతి అసెంబ్లీకి నామినేషన్ వేసిన 46 మందిలో 16 మంది వైసీపీ అభ్యర్థి భూమన్ అభినయ్‌కు సంబంధించిన వారేనని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు చినబాబు (వట్టికుంట శంకరనారాయణ) ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో అనేక అక్రమాలకు, అవినీతికి ఎమ్మెల్యే భూమన పాల్పడ్డారని విమర్శించారు. తిరుమలలో తండ్రి, తిరుపతిలో తనయుడు ఏలుతూ ప్రశ్నించిన వారిపై దారుణంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి నుంచీ తిరుపతికి విముక్తి కల్పించాలని ఓటర్లను కోరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలన్నారు. ఈసమావేశంలో అన్నా అనిత యాదవ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కేశవులురెడ్డికి అభినందన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: ఎస్వీయూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ ఈ. కేశవులురెడ్డి బెస్ట్ టీచర్ అవార్డు-2024 పొందారు. బోధన రంగంలో ప్రొఫెసర్ కేశవులురెడ్డి చేసిన కృషికి గుర్తింపుగా, అహ్మదాబాద్‌కు చెందిన గ్లోబ్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేశవులురెడ్డిని వర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

రాయలచెరువును నీటిపారుదల ప్రాజెక్టుగా చేస్తా

- పులివర్తి నాని

- పలువురు టీడీపీలో చేరిక


పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 6: రాయలచెరువు లోతట్టు, దిగువ ప్రాంతాల రైతులతో చర్చించి అందరి ఆమోదంతో చిన్నపారుదల ప్రాజెక్టుగా రాయలచెరువును అభివృద్ధి చేస్తానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన ప్రముఖపారిశ్రామిక వేత్త, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు సోమవారం రాజకీయాల్లోకి పునఃప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాని మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వారిని మత్తుకు బానిసలు చేశారన్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో అందరూ నష్టపోయారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా చేయాలని కోరారు. చిత్తూరు టీడీపీ పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు పరిశ్రమల ఏర్పాటు దిశగా కృషిచేస్తామని చెప్పారు. మారుమూల పల్లె నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగిన కేశవులు నాయుడును యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ గ్రూప్స్ అధినేత దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి తాయిలాలకు లొంగిపోతే చంద్రగిరి ఎప్పటికీ అభివృద్ధికి నోచుకోదన్నారు. నియోజకవర్గాన్ని గాలికివదిలి ఎమ్మెల్యే తన సంపాదనతో కుటుంబ అభివృద్ధి చేసుకున్నారని ఆరోపించారు. కేశవులు నాయుడు మాట్లాడుతూ కొన్ని కారణాల వల్ల రాజకీయాలకు దూరమయ్యానని, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులదృష్ట్యా తిరిగి రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్సీపురం నుంచి కొత్తకండ్రిగ వరకు భారీ స్కూటర్‌ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, యాదవ సంఘం నాయకుడు బాబు యాదవ్, ఉమాపతి నాయుడు, జనార్ధన్‌చౌదరి, జేడీ జగన్, హరిప్రసాద్, లీలామోహన్ నాయుడు, ఢిల్లీనాథరెడ్డి, సురేంద్ర నాయుడు, ధనంజయరెడ్డి, మండల నాయకులు గిరి నాయుడు, మునెయ్య, గిరిధర్ రెడ్డి, మహేష్, దినేష్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

టీడీపీలో పలువురు చేరిక

పులివర్తి నాని సమక్షంలో సోమవారం పలువురు టీడీపీలో చేరారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కేశవులు నాయుడు, లంబోదర నాయుడుకు టీడీపీ కండువా కప్పి నాని ఆహ్వానించారు. కమ్మకండ్రిగ సర్పంచ్ కావ్యా వేణుగోపాల్ నాయుడు, బాదూరు మాజీ సర్పంచ్ ధనంజయులతోపాటు బలిజపల్లె, పీపీపురం, బాదూరు నుంచి 300మంది పార్టీలో చేరారు. వీరికి నాని కండువా కప్పి ఆహ్వానించారు.

ఎవరూ చేయని అభివృద్ధి చేసి చూపిస్తా: వరప్రసాద్


గ్రామస్తులతో వెలగపల్లి వరప్రసాదరావు - పాశిం సునీల్‌తో కలసి వరప్రసాదరావు ఎన్నికల ప్రచారం

సూళ్లూరుపేట/ వాకాడు, మే 6: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరూ చేయనటువంటి అభివృద్ధిని చేసి చూపిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు పంచాయతీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పాలకులు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. తీరప్రాంతాల్లో మౌలిక వసతులు దారుణంగా ఉన్నాయన్నారు. తాను గెలిచిన వెంటనే ఏడాది లోగా పులికాట్ సరస్సు ముఖద్వారాన్ని పూడిక తీయించడమే కాకుండా మెరుగైన రోడ్లను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఎంపీ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. సాగునీటి సమస్య పరిష్కరిస్తానని, అటవీ ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో అర్థంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అవినీతి, అక్రమాలే ధ్యేయంగా పనిన ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, రాజసులోచనమ్మ, మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిట్టమూరు, వాకాడుల్లో...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు వాకాడు, చిట్టమూరు మండల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గూడూరు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ టీడీపీ నాయకురాలు పనబాక లక్ష్మితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు మధుమేహంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), మే 6: గర్భధారణ సమయంలో వచ్చే మధుమేహంపై గర్భిణులు అవగాహన కలిగి వున్నప్పుడే.. పుట్టే బిడ్డలకు ఆ మధుమేహం రాకుండా ఆరోగ్యంగా పుడతారని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సోమవారం ఫుడ్‌సైన్స్ న్యూట్రీషన్, డైటెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం సైన్స్ ఎస్వీ యూనివర్సిటీ, మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్, ఎస్వీ వైద్య కళాశాల పరిధిలోని ఐసీఎంఆర్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో గర్భధారణ సమయంలో మధుమేహం, తీసుకోవాల్సిన ఆహారంపై గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భందాల్చిన సమయంలో తీసుకునే ఆహారం, చేసే వ్యాయామం, ప్రతీ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఐసీఎంఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, డాక్టర్లు మధుసూదన్, సునీత, స్రవంతి, ఉమాదేవి, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కోలా మంజుల, డాక్టర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


గంగాధర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: ఎస్వీయూ ఆర్కియాలజీ పరిశోధకులు ఎస్. గంగాధర్ డాక్టరేట్ పొందారు. గద్వాల సంస్థాన చరిత్ర అంశంపై ప్రొఫెసర్ పి. భాస్కరరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు. గంగాధర్ ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

టైం స్కేల్ ఉద్యోగి మృతి


కుమార్ (ఫైల్‌ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: ఎస్వీయూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో టైం స్కేల్ ఉద్యోగి కుమార్(47) మృతి చెందారు. నారాయణవనంకు చెందిన కుమార్, గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కుమార్ మృతి పట్ల వర్సిటీ టైంస్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రసాని సుబ్రమణ్యంరెడ్డి, గోపీ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు వారు సానుభూతిని తెలియ చేశారు.

టీడీపీ నేత ఇంటిపై దాడి


టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వెంకటరత్నం

భాకరాపేట, మే 6: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టి వెంకటరత్నం ఇంటిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లు భాకరాపేట పోలీసులకు ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ గత వారం తమ వీధిలో చాలా మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సందర్భంగా ఆ వీధి అంతటా టీడీపీ జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం రాత్రి వైసీపీ వారు తమ వీధిలో ప్రచారం నిర్వహించారని తెలిపారు. అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు తమ వీధిలోని టీడీపీ జెండాలు పీకి కాల్చివేశారని, ఎవరూ టీడీపీకి ప్రచారం చేయరాదని గట్టిగా అరుస్తూ తమ ఇంటికి ఉన్న జెండాలు పీకేసి, గేట్లు గట్టిగా కొట్టి వెళ్లిపోయారన్నారు. ఆ సమయంలో తాను పొలం వద్ద ఉన్నానని, ఇంటిలో ఉన్న తన కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారని, అలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

రూ.90 లక్షల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ బంగారాన్ని తనిఖీ చేస్తున్న సేల్స్‌టాక్స్ అధికారులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పిచ్చాటూరు, మే 6: పిచ్చాటూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద రూ.90 లక్షల విలువ చేసే బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలసి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న బస్సులో ఓ ప్రయాణికుడి వద్ద రూ.90 లక్షల విలువ చేసే బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతికి చెందిన కాశీ జ్యువెలరీస్ నుంచి వ్యాపార లావాదేవీల నిమిత్తం తీసుకెళుతున్నట్లు రసీదులు చూపడంతో సేల్ టాక్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. జీఎస్టీ ఆన్‌లైన్‌లో కాకుండా మ్యాన్యువల్‌గా చెల్లించినట్లు గుర్తించి రూ.5లక్షల 35వేలు జరిమానా విధించారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి


ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న మురళి

భాకరాపేట, మే 6: టీడీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్లలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారంనిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని కోరారు. నమూనా బ్యాలెట్ పత్రాలను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మదనమోహన, సహదేవరెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు

తిరుమల, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,927 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 29,196 మంది తలనీలాలు సమర్పించారు.

9న క్రికెట్ జట్ల ఎంపికలు

తిరుపతి(క్రీడలు), మే 6: చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-25 సీజన్‌కిగాను ఈనెల 9న సీనియర్, అండర్-19 బాయ్స్ క్రికెట్ జట్ల ఎంపికలు జరగనున్నాయి. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్లకు వయో పరిమితి లేదు. అండర్-19కి మాత్రం 2005సెప్టెంబరు1 నుంచి 2010 సెప్టెంబరు1 మధ్య జన్మించినవారు అర్హులు. ఆసక్తిగల అండర్-19 విభాగ ఎంపికలకు ఉదయం ఎనిమిది గంటలకు, సీనియర్స్ జట్టుకైతే మధ్యాహ్నం రెండు గంటలకు తుమ్మలగుంట మైదానానికి చేరుకోవాలి. వివరాలకు 98490 26131, 79818 80381 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ ఖాళీ

ఊకా విజయకుమార్ సమక్షంలో టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీ సీనియర్ నేతలు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి సూపర్ సిక్స్ పథకాలతో ఆకర్షితులై పెద్దఎత్తున టీడీపీ, జనసేన పార్టీలో చేరుతున్నారని టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ అన్నారు. 29, 30 డివిజన్ల నుంచి ఊకా, జేబీ శ్రీనివాసులు సమక్షంలో వైసీపీ నేత మధు ఆచారి ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించుకుంటామని ఈ సందర్భంగా వారు అన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేష్, శాంతమ్మ, బ్రహ్మయ్యాచారి, కల్యాణ్, వెంకటముని, లత, సులేమాన్, ప్రసాద్, సతీష్ ఉన్నారు.

టీడీపీలో చేరిన గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ చింతా భరణి



వైసీపీకి మరో ఎదురుదెబ్బ

టీడీపీలోకి మేయర్ డివిజన్ అధ్యక్షుడు చింతా భరణి

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి మరో దెబ్బ తగిలింది. మేయర్ డాక్టర్ శిరీష ప్రాతినిధ్యం వహిస్తున్న 27వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ చింతా భరణి యాదవ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన అనుచరులూ పెద్దఎత్తున టీడీపీలో చేరారు. వీరికి తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిల్డర్ కొమ్ము చెంచయ్య యాదవ్‌కు మబ్బు దేవనారాయణ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భరణి యాదవ్‌తోపాటు చింతా సురేష్ యాదవ్, మాజీ గంగమ్మ గుడి పాలకమండలి సభ్యుడు రాజేశ్వరరావు, సి.మునికృష్ణ, శివ, బాషా, సుకుమార్, వినోద్, ముని, ఉదయ్, ప్రేమ్, లోకేష్, మణి యాదవ్, దినకర్, అనీల్, తుల్లా, రాజా, వంశీలతోపాటు మూడు వందల మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపునకు చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊకా విజయ్ కుమార్, ఈతమాకుల హేమంత్, కంకణాల రజినీకాంత్ నాయుడు, కృష్ణ యాదవ్, కట్టా జయరామ్ యాదవ్ పాల్గొన్నారు.

తిరుమలలో అయోధ్యకాండ పారాయణం

తిరుమల, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం ఉదయం జరిగిన పదో విడత అయోధ్యకాండ అఖండ పారాయణంతో తిరుమల సప్తగిరులు మార్మోగాయి. అయోధ్యకాండలోని 35 నుంచి 39వ సర్గవరకు 164 శ్లోకాలను, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 189 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత, మారుతి శ్లోకపారాయణం చేశారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈపారాయణంలో ధర్మగిరి వేదపాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ వేదాధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు రాజేష్ బృందం 'దేవతల గాచిన దేవుడితడు, రామ రామ శ్రీరఘురామ' అనే కీర్తలను ఆలపించారు.

వైసీపీ కవ్వింపు చర్యలు మానుకోవాలి

కమ్మసంఘం, కేబుల్ ఆపరేటర్ల ఆత్మీయ సమావేశంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి



కమ్మ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆరణి శ్రీనివాసులుకు సన్మానం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలు మానుకోవాలని, ఎన్డీఏ కూటమి నేతలపై చేయివేస్తే సహించేదిలేదని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కమ్మసంఘం, తిరుపతి కేబుల్ ఆపరేటర్లతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత కొల్లూరి ఇందు శేఖర్, కమ్మ సంఘం అధ్యక్షుడు పురందర నాయుడు, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆరణి మాట్లాడుతూ వైసీపీ పనైపోయిందని, నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌ల డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రంలో రాబోతుందన్నారు. కమ్మ సంఘం నేతలు మాట్లాడుతూ తిరుపతిలో భూమన అరాచకాలకు ఫుల్‌స్టాప్ పడాలంటే జనసేన అభ్యర్థి ఆరణిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మందలపు మోహన్ రావు, చినబాబు, కృష్ణమూర్తి నాయుడు, తమ్మినేని వెంకటేశ్వర్లు, మస్తాన్ నాయుడు, కంకణాల రజినీకాంత్ నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, గుణశేఖర్ నాయుడు, వివేక్ పాల్గొన్నారు. కేబుల్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ.. ఏబీఎన్, టీవీ5లపై కేబుల్ టీవీలో ఉండే నిషేధాన్ని అధికారంలోకి రాగానే ఎత్తివేస్తామని ఆయన తెలిపారు. పోల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తామన్నారు. జగన్ హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరణి విమర్శించారు. ఆపరేటర్లకి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. కేబుల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మబ్బు దేవనారాయణ రెడ్డి, సురేష్, అధ్యక్షుడు ఒంగోలు వెంకటేష్, కార్యదర్శి కోలా హరి, ఆర్వీ రమణ, టీడీపీ మాజీ ఎమ్మెల్యే మోహన్, నేతలు నరసింహ యాదవ్, ఊకా విజయ్ కుమార్, కందాటి సురేష్ రెడ్డి, పాటకం వెంకటేష్, సింగంశెట్టి సుబ్బరామయ్య పాల్గొన్నారు. కాగా, 26వ డివిజన్‌లోని నవాబుపేటకు చెందిన మణి, షాజహాన్ సాహెబ్‌తో పాటు పలువురు యువత టీడీపీలో చేరారు.



ఆరణి, సుగుణమ్మలను గజమాలతో సత్కరించిన టీడీపీలో చేరిన నవాబుపేట యువత

కూటమి గెలుపుతోనే రజకుల అభివృద్ధి

● రజక సంక్షేమ సంఘం



మీడియాతో మాట్లాడుతున్న చెంబకూరు రాజయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 6: ఎన్డీఏ కూటమి గెలుపుతోనే రాష్ట్రంలో రజకుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెంబకూరు రాజయ్య తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీని ఎన్టీఆర్ స్థాపించాక బీసీల్లో తొలుత రజక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నాటి నుంచీ నేటి దాకా రజకుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. చంద్రబాబు 2024 ఎన్నికల మేనిఫెస్టోలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తిమ్మినాయుడుపాళెంలో దోబీఘాట్‌ను వైసీపీ నాయకులు కబ్జా చేసి ఇళ్లు కట్టుకుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. రజకులు, బీసీలు కూటమికి ఓటు వేసి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాజయ్య విజ్ఞప్తి చేశారు. నాయకులు మట్టా పురుషోత్తం, వేమలపాటి శ్రీనివాసులు, బీజేపీ బీసీ మోర్చా కన్వీనర్ రామచంద్ర, రవి, పైడిపల్లి బాబు, హరి, చరణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్‌లదే భవిష్యత్

● ఎన్డీఏ విజయాన్ని ఆపే శక్తి ఎవ్వరికీ లేదు
● 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ



గాజుగ్లాసు (3వ నెంబరు)పై ఓటు వేయాలని డమ్మీ బ్యాలెట్‌తో అవగాహన కల్పిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లదే భవిష్యత్ అని, సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయాన్ని ఆపే శక్తి ఎవ్వరికీ లేదని 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఆర్సీ మునికృష్ణ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 35వ డివిజన్ భవానీనగర్, ఏడీ బిల్డింగ్ రోడ్, వీవీమహల్ రోడ్డులో డమ్మీ బ్యాలెట్ బాక్స్‌తో భారీ ఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరుపతి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు గాజు గ్లాసు గుర్తుపై, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వృద్ధులు, తోపుడు బండ్ల వారితో గాజుగ్లాసుకు ఈవీఎం మిషన్లో ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్సీ మాట్లాడుతూ.. వైసీపీ ఖాళీ అయిపోయిందని.. ఆరణి భారీ మెజారిటీతో గెలవబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, తెలుగుదేశం నాయకులు హరిబాబు అలియాస్ చిన్ని, జనసేన డివిజన్ అధ్యక్షుడు రాజేష్ ఆచారి, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, కూటమి నాయకులు సురేష్, సుజాతమ్మ, దర్శన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, శ్రీకాంత్, నాగవేణి, శ్యామలమ్మ, రేవతి, సర్వేపల్లి హరికృష్ణ రాయల్‌తోపాటు పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరణి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న ఆర్సీ మునికృష్ణ, కూటమి నేతలు

భక్తుడిపై ట్యాక్సీ డ్రైవర్ దాడి

తిరుమల, మే 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓభక్తుడిపై ట్యాక్సీడ్రైవర్ దాడి చేశాడు. సోమవారం రైల్వేకోడూరుకు చెందిన ఓ భక్త బృందం శ్రీవారిని దర్శించుకుని రాంభగీచ-2 ముందున్న పార్కింగ్ వద్దకు చేరుకుంది. తమ కారును వెనక్కితీసే క్రమంలో ట్యాక్సీని ఢీకొంది. దాంతో ట్యాక్సీ డ్రైవర్, భక్తుల మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి భక్తుడిపై ట్యాక్సీ డ్రైవర్ దాడి చేశాడు. సమాచారం అందుకున్న విజిలెన్స్ సిబ్బంది వచ్చి సర్దిచెప్పి పంపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



కలెక్టర్, ఎస్పీలతో దీపక్‌మిశ్రా

తిరుపతి (కలెక్టరేట్), మే 6: జిల్లాలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పోలీసు అబ్జర్వర్ దీపక్‌మిశ్రా అధికారులకు సూచించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. 2,140 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రచార పంపకాల్లో చిలక్కొట్టుడు

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే తీరుగా ఇక్కడి పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో దొరికినకాడికి సంపాదించుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఓట్ల కొనుగోలు కంటే ముందుగానే ప్రచార పర్వంలో ఇందుకు తెర లేపారు. ప్రచారానికి ఇస్తున్న సొమ్ములో కొందరు నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణ వార్డుల్లో ప్రజాప్రతినిధులకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. వీరు రోజూ వార్డులో 20మంది చొప్పున తిప్పాల్సి ఉంటుంది. బూత్ కన్వీనర్, (రాజీనామా చేసిన) వలంటీర్ ఇందులో పాల్గొంటారు. జెండాలు పట్టుకుని తిరిగేవారికి రోజుకు రూ.300 చొప్పున, వలంటీరుకు, బూత్ కన్వీనరుకు రూ.500 ఇవ్వాల్సి ఉంటుంది. ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ కూడా పెట్టాలి. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రచార వ్యయంలో కొంతసొమ్ము జేబులో వేసుకుంటున్నారని భోగట్టా. తమకిచ్చే మొత్తంలో కోతలు పెట్టడంతో ప్రచారానికి వచ్చిన వారు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. వారి ఇళ్లకు వెళ్లి పంచాయతీ పెడుతున్నారు. విషయం ఆ నోటా ఈనోటా తెలుసుకుంటున్న ఇన్‌చార్జిలు వార్డు ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారని సమాచారం.



- రేణిగుంట

ఇదీ మందు



ఎన్నికల డ్యూటీనా..వద్దు బాబోయ్

ఎలక్షన్ డ్యూటీ అంటేనే ఉద్యోగులు విసుక్కుంటున్నారు. 2019 నాటి రెమ్యునరేషనే ఇప్పుడు కూడా చెల్లించాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు చూసి పెదవి విరుస్తున్నారు. జిల్లాలో దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు ఇదెక్కడి శిక్ష అంటూ తెగ బాధ పడిపోతున్నారు. ఎన్నికల ప్రిసైండింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350 చెల్లిస్తారట. నాలుగో తరగతి ఉద్యోగులకయితే రూ.200, వీడియో సర్వైలెన్సు టీముకు రూ.1200, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ టీములకు రూ.1000 చెల్లిస్తామనడంతో వారంతా బిక్కముఖం వేస్తున్నారు. కంట్రోల్ రూము, కాల్‌సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ సిబ్బందికి భత్యం ఇంకా తక్కువ. రోజుకు రూ.200 మాత్రమే. పోలింగ్ విధులకు హాజరయ్యే పోలీసు, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోంగార్డులకు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు లంచ్‌ప్యాక్‌తో పాటు రూ.150 చెల్లిస్తారట. ఇదేమూలకూ సరిపోదని సిబ్బంది గొణుక్కుంటున్నారు. ఇక ఓట్ల లెక్కింపు రోజు లంచ్ కింద రూ.150 చెల్లిస్తామనడంతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. కష్టమైన ఎన్నికల విధులకు హాజరయ్యే వారికి ఇంత తక్కువ రెమ్యునరేషన్ చెల్లించడం దారుణమంటున్నారు. మరోపక్క తమకు కూడా ఎన్నికల డ్యూటీ వేసి రూ.250 చెల్లిస్తామంటే దూరాభారం పోయొదెలా అని అంగన్‌వాడి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.




- తిరుపతి (నేరవిభాగం)



బాపనయ్యా..శెభాషయ్యా..

87 ఏళ్ల బాపనయ్యలో ఉత్సాహం ఓటెత్తింది కదూ.. అవును పడకగదికే పరిమితమైన అతడు సోమవారం ఓటేశాడు. కాలు కదపకుండానే తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అన్ని అవయవాలు పనిచేస్తున్నా, పరిస్థితులన్నీ అనుకూలించినా ఓటేయని బద్ధకస్తులకు బాపనయ్య స్ఫూర్తిగా నిలిచాడు. 85ఏళ్లు దాటి పోలింగ్ బూత్‌కు రాలేని వృద్ధులకూ, దివ్యాంగులకూ ఈసారి ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఇతను వినియోగించుకున్నాడు. తిరుచానూరుకు చెందిన బాపనయ్య 1970 నుంచీ క్రమం తప్పకుండా ఓటేస్తున్నాడు. అనారోగ్యకారణంగా పన్నెండేళ్లుగా కదలలేకపోతున్నాడు. ఓటు వేయలేకపోతున్నానని దిగులు పడేవాడు. కానీ ఈసారి ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ పుణ్యమాని ఇంటికే సిబ్బంది వచ్చి రహస్య పద్ధతిపై ఓటేయించుకున్నారు. ఓటేశాక బాపనయ్య పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

- తిరుపతి(కలెక్టరేట్)



"చూస్తూ ఉండండి ఇక్కడొక గొప్ప పట్టణం ఏర్పడబోతోంది. ఇక్కడే ఆర్బీకే సెంటరు, ఇక్కడే హెల్త్ క్లినిక్, ఇక్కడే సెక్రటేరియట్, ఇక్కడే కళ్యాణమండపం, ఇక్కడే పార్కులు, స్కూళ్లు, ఇక్కడే ఆటో స్టాండు, ఇక్కడే జనతా బజారు.. ఈ ప్లాన్ చూస్తే ముచ్చటేస్తోంది. రాష్ట్రంలోనే మోడల్ కాలనీ ఇది"

- 2020 డిసెంబరు 28న ఊరందూరులో జగనన్న ఇళ్ల కాలనీల పథకాన్ని ప్రారంభిస్తూ సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవి.

"అప్పట్లో, నవాబుల కాలంలో ఒక పట్టణం కట్టాలంటే 500 ఏళ్లు పట్టేది. శ్రీకాళహస్తి 25వేల ఇళ్లున్న పట్టణంగా అభివృద్ధి చెందడానికి 500 ఏళ్లు పట్టింది. ఇప్పుడు జగనన్న పట్టణం.. జేసిటీ కేవలం ఒకటిన్నర ఏళ్లలో ఇక్కడ ఏర్పడబోతోంది."

- అదే రోజున అదే సభలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి చెప్పిన గొప్పలు ఇవి.

మరి వాస్తవం ఎలా ఉంది?

జగనన్న పాలనలాగే ఉంది!



ఆంధ్రజ్యోతి - తిరుపతి/శ్రీకాళహస్తి

జే సిటీ అను జగన్ చూపిన సినిమా

మోడల్ జగన్ సిటీ

ఎక్కడ: ఊరందూరు సమీపంలో

విస్తీర్ణం: 157 ఎకరాలు

ఇళ్ల పట్టాలు: 4,953

ఇచ్చినవి: 4,304

మూడేళ్ల నాలుగు నెలల తర్వాత స్థితి

నిర్మాణం అయినవి: 1,240

స్లాబ్ దాకా వచ్చినవి: 1,760

పునాదులకే పరిమితం: 1,200

ఇటుక పడనివి: 753

నివాసం ఉన్న ఇళ్లు: 10



మూడేళ్లు దాటినా ముప్పయి కుటుంబాలు కూడా లేని ఊరందూరు మోడల్ కాలనీ

జే సిటీ ఇలా ఉంది..

కనీస మౌలిక సదుపాయాలు లేవు. కాలనీ మొత్తం బురదతో కూడిన రోడ్లే అధికంగా కనిపిస్తున్నాయి. కరెంట్, నీటి సరఫరా లైన్లు కొన్ని వీధులకే పరిమితమయ్యాయి. కొన్ని ఇళ్లు చెట్లు, రాళ్ల మధ్య ఉండిపోయాయి. లేఅవుట్ మొత్తం పూర్తయితే కానీ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని అధికారులు చేతులేత్తేశారు. లబ్ధిదారుల ఆప్షన్ మేరకు ప్రభుత్వమే కట్టిన ఇళ్లు పగుళ్లతో భయపెడుతున్నాయి. సమీపంలో ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వ్యక్తుల అసాంఘిక కార్యక్రమాలకు ఈ ప్రాంతం అనువుగా మారింది. జగన్ శంఖుస్థాపన చేసిన ప్రదేశంలోనే మద్యం తాగుతున్నారు. ఆ ప్రాంతమంతా మద్యం బాటిళ్ల, పొగాకు ఉత్పత్తి ప్యాకెట్లతో నిండిపోయి కనిపిస్తోంది. తలుపులు, కిటికీలు లేని ఈ ఇళ్లు వ్యభిచారానికి అనువుగా మారిపోయాయి. దీంతో ఊరికి దూరంగా ఉన్నా సొంత ఇల్లు కదా అనే ఆశతో ఉన్న ఉపాధిని వదిలి వచ్చి ఇళ్లు కట్టుకున్నవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ నివాసం ఉండలేమని నిర్ణయించుకుని దూరంగా అద్దె ఇళ్లలో ఉండాల్సి వస్తోంది.



పునాదులు దాటనివెన్నో! ←

ఈ డబ్బుతో ఇల్లెలా సాధ్యం?

ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నది రూ.1.50 లక్షలు. ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు కలిపి రూ.1.80 లక్షలు ఇస్తున్నారు. ఆపై ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఆ నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. జారీ చేసిన నిధుల వరకే కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించి వెళ్లిపోయారు. నిజానికి మార్కెట్‌లో నిర్మాణ సామగ్రి ధరలు చుక్కల్లో ఉన్నాయి. ప్రస్తుత ధరలను బట్టి చదరపు అడుగుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు ఖర్చు అవుతోంది. కానీ ప్రభుత్వం ఇస్తున్నది రూ.662 మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం ఇల్లు నిర్మించాలంటే దాదాపు రూ.5 లక్షల పైమాటే. అంటే మిగిలిన సొమ్మును పేదలు అప్పు చేసి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. సొంతింటి కలను ఎలాగైనా నెరవేర్చుకోవాలనే తపనతో కొందరు అప్పులు తెచ్చి వేలకు వేలు వడ్డీలు కడుతున్నారు. వీళ్లను చూసిన కొందరు బేస్మెంట్ లేవల్‌లోనే వదిలేసి వెళ్లిపోయారు. మొత్తం మీదుగా 'జే సిటీ' పేదల కలలకే పరిమితం అయ్యింది.



ఇక్కడ ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా...

సొంతిల్లు వచ్చిందని కదా అని సంబరపడ్డాం. ప్రభుత్వం కట్టిన ఇళ్లు సరిపోకపోవడంతో సొంత డబ్బుతోనే ఇల్లు కట్టుకుంటున్నా. నీళ్లు లేవు. ఇంటి నిర్మాణానికి కూడా నీళ్లలేక అవస్థ పడుతున్నాం. మనుషులే లేని ఈ కాలనీలో ఇల్లు కట్టుకోవడం కరెక్టేనా అనిపిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- సుబ్రహ్మణ్యం, లబ్ధిదారుడు



ఎటు చూసినా బురద మడుగులే





తలుపులు, కిటికీలు లేని మోడల్ కాలనీలోని ఇళ్లు

విజనరీ నేత నాయకత్వం కోసం..

నేను సైతం...

మాది తొట్టంబేడు మండలం పొయ్యి గ్రామంలో రైతు కుటుంబం. నేను చదువుకునే రోజుల్లో నాటి సీఎం చంద్రబాబునాయుడు విజన్-2020 గురించి చెబుతుండేవారు. భవిష్యత్ గురించి ఆయన విజన్ అర్థమయ్యేది. డిగ్రీ తర్వాత శ్రీకాళహస్తిలోని ప్రైవేటు స్కూలులో కొన్నాళ్లు పనిచేశాను. రూ.1000 జీతం వచ్చేది. ఐటీ రంగంతో ఉద్యోగ విప్లవం వస్తుందనే చంద్రబాబు మాటల స్ఫూర్తిగా కష్టపడి 2000లో తిరుపతి ఎస్వీఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ చదివాను. వెంటనే బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. అక్కడ నుంచి అమెరికాలోని చికాగోలో అవకాశమొచ్చింది. 14 ఏళ్లుగా అక్కడే స్థిరపడ్డాను. నెలకు రూ.10లక్షల జీతం. అట్టడుగు నుంచి ప్రారంభమైన నా జీవితం ఉన్నత స్థాయికి చేరిందంటే చంద్రబాబు చలవేనంటాను. ఐటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి వల్లే నాలాంటివారెందరి బతుకులో బాగుపడ్డాయి. వైసీపీ పాలనలో ఈ ఐదేళ్లుగా రాష్ట్రం అధోగతి పాలవుతోందని తెలిసి చాలా బాధ కలుగుతోంది. అందుకే రాష్ట్ర భవిత కోసం మళ్లీ చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టాల్సిన అవసరం ఉందని భావించాను. అందుకోసం ఆయన తరఫున ప్రచారం చేయాలని స్వస్థలం వచ్చాను. నేనేకాదు.. చంద్రబాబు విజనరీ కృషి ఫలితంగా ఉద్యోగాలు పొందిన 1200 మంది అమెరికా నుంచి వచ్చాం. నియోజకవర్గాల వారీగా సొంత ప్రాంతాల్లో ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్నాం. అప్పుల పాలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి అభివృద్ధికి బాట వేసే శక్తి చంద్రబాబునాయుడికే ఉందని యువతకు వివరిస్తున్నాం.



- బి.త్రివేది కుమార్,ఎన్నారై

- శ్రీకాళహస్తి



పన్నంగాడు ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు (ఫైల్)

అభయాంజనేయా..అనుగ్రహించు

సెంటిమెంట్

రాజకీయ నాయకులకు సెంటిమెంట్లు ఎక్కువ. కీలకమైన ఎన్నికల సమయంలో మరీనూ. అడుగుతీసి అడుగు వేయాలంటే ఇష్ట దైవానుగ్రహాన్ని స్మరణకు తెచ్చుకోనిదే కదలరు. మామూలు రోజుల్లో అంతగా పట్టని సెంటిమెంట్లకు ఎన్నికల్లో మాత్రం అగ్రాసనమేస్తారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెట్టాలంటే నేతలంతా ఈశాన్యం సెంటిమెంట్ పాటించి తీరతారు. తడ మండలానికొచ్చే సరికి రాష్ట్ర సరిహద్దు పన్నంగాడు వద్ద ప్రసన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నాకే అడుగు ముందుకేస్తారు. అక్కడ నుంచే ప్రచారం మొదలుపెడతారు. దైవ నమ్మకమొక్కటే కాదండోయ్..కొన్నిసార్లు తడ మండల ఓట్ల మెజార్టీయే విజయావకాశాలను నిర్ణయిస్తుందని అభ్యర్థుల లెక్క. 2014లో వైసీపీ సుమారు 3,672 ఓట్ల మెజార్టీతో గెలవడంలో తడ మండలం కీలకంగా వ్యవహరించింది. దీంతో పార్టీల నాయకులు ఇప్పటికే ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

-తడ



ఈ గ్లాస్ 'గుర్తు'ండాల్సిందే..

థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అనే డైలాగ్‌తో సుపరిచితమైన సినీ నటుడు ప్రధ్వీ సోమవారం తిరుపతిలో సందడి చేశారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పక్షాన తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఓ చిన్న అంగడిలో టీ తాగి తర్వాత అదే గ్లాసు చూపిస్తూ ఈ గుర్తుకే మీ ఓటు వేయాలని ఆ చిరువర్తకుడ్ని కోరుతూ కాసేపు హాస్యం పండించారు.

- తిరుపతి

పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గం

● సండింగ్ స్నాప్‌షాట్



సత్యవేడును వలస నియోజకవర్గంగా మార్చేశారనే మనోవేదన ఇక్కడి ప్రజల్లో దశాబ్దాలుగా ఉంది. సత్యవేడుకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేల్లో అత్యధికులు నాన్ లోకలే. కేవలం ఇద్దరు లోకల్స్‌కు మాత్రమే సత్యవేడు ఎమ్మెల్యే అయ్యే అవకాశం వచ్చింది. లోకల్స్‌లో 1985, 1994లో గెలిచిన ఎం.సురాజన్ ఒకరు కాగా ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆదిమూలం మరొకరు. సురాజన్ స్వగ్రామం సత్యవేడు మండలం సిరుణంబుదూరు. ఆదిమూలం స్వగ్రామం నియోజకవర్గంలోని నారాయణవనం మండలం భీమునిచెరువు. ఇక నాన్‌లోకల్ చరిత్రను పరిశీలిస్తే.. 1962లో జరిగిన మొట్ట మొదటి ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి తుంబూరు బలకృష్ణది పుత్తూరు. 1967లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి కఠారి మునస్వామిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. 1972, 1978, 1989ల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సి.దాస్ మదనపల్లి వాసి. 1983లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య మనోహర్‌ది గుడిపాల. 1999లో గెలిచిన టీడీపీ అభ్యర్థి ఎస్.శివప్రసాద్‌ది చంద్రగిరి. 2004లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామిది కార్వేటినగరం. 2009లో ఎన్నికైన తెలుగుదేశం అభ్యర్థి హేమలత స్వస్థలం తూర్పు గోదావరి. 2014లో గెలిచిన తలారి ఆదిత్యది గుడిపాల. ఇలా పక్కా నాన్‌లోకల్ నియోజకవర్గంగా మారిన సత్యవేడుకు ఈసారి వైసీపీ నుంచి పోటీ చేస్తున్న నూకతోటి రాజేష్ కూడా నాన్ లోకల్. జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వింజంలక్ష్మిరెడ్డిపల్లి ఈయన స్వస్థలం. నివాసం మాత్రం తిరుపతిలో.

- సత్యవేడు

జన కేతనం

క్వారీ లాక్కుని కరెంటు బిల్లూ కట్టకుండా..



జనార్ధన్‌నాయుడు

కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన జనార్దన్ నాయుడికి పలమనేరు మండలం నెల్లిపట్ల వద్ద క్వారీ ఉంది. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంకటేగౌడ దాన్ని ఆక్రమించుకున్నారు. 'అధికారాన్ని అడ్డం పెట్టుకుని, సీఎం జగన్ పేరు చెప్పుకొని నా క్వారీని వెంకటేగౌడ లాక్కున్నారు. అందులోని యంత్రాలు కొనుగోలు చేసినట్లు రూ.1.48 కోట్లకు అగ్రిమెంటు రాయించుకున్నారు. రూ.37 లక్షలు, రూ.5 లక్షలకు చెక్కులు ఇచ్చారు. రూ.37 లక్షల చెక్ బౌన్స్ అయింది. కేసు కోర్టులో నడుస్తోంది. రూ.5 లక్షల చెక్ కూడా బౌన్స్ అయింది. దీనికి సంబంధించి రూ.4 లక్షలు వేరేవాళ్ల ద్వారా సెటిల్ చేశారు. రూ.48 లక్షల కరెంటు బిల్లు బకాయి ఉందని నాకు నోటీసులు వస్తున్నాయి. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాను' అని జనార్దన్ నాయుడు ఆవేదన వ్యక్తంచేశారు.

పలమనేరు నియోజకవర్గానికి సరిహద్దు కర్ణాటక రాష్ట్రం. ఇసుక, మట్టి, ఎర్రచందనం, పశువుల కబేళాలు, బియ్యం.. అక్రమ రవాణాకు గేట్‌వేగా పలమనేరును మార్చేశారు. ఇందులో ప్రతి దానికీ వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడకు కచ్చితంగా వాటా ఇవ్వాల్సిందేనన్న ప్రచారం జోరుగా ఉంది. ఒక్క ఇసుక అక్రమ రవాణా కమీషన్లే ఈ ఐదేళ్లలో రూ.వంద కోట్ల వరకు ఉంటుందని విపక్షాలు అంటున్నాయి. గత ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన పది హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా రికార్డు సృష్టించారు. అధికారంలో ఉండి.. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడే ఇలా వ్యవహరించిన వెంకటేగౌడ.. రెండోసారి గెలిస్తే నియోజకవర్గాన్ని ఇంకేం చేస్తారోనని అక్కడి ప్రజలు అంటున్నారు.

– చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అవినీతి అనకొండ!



- ఇసుక, మట్టి, భూమి, క్వారీలను వదలరు ● అక్రమ రవాణా ఏదైనా కమీషన్లు చేరాల్సిందేనట
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తీరుపై విమర్శలు ● ఒక్క హామీనీ నెరవేర్చని ఎమ్మెల్యేగా రికార్డు

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?




కర్ణాటక సరిహద్దు ప్రాంతం నాలుగు రోడ్ల సమీపంలో ఇసుక డంప్ – పలమనేరు కేటిల్ ఫాం వద్ద కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు

ఇసుక అక్రమ రవాణాలో రూ.వంద కోట్లు!

పెద్దపంజాణి మండలంలోని శంకర్రాయలపేట చెరువు (మాడీచెరువు), గంగవరం మండలంలోని దండపల్లి చెరువు, ఆయా మండలాల్లో ప్రవహించే కౌండిన్య నదీ పరివాహక ప్రాంతాల నుంచి పగటి పూట ఇసుకను తోడేసి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని నాలుగు రోడ్ల వద్ద డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిళ్లు కర్ణాటకకు తరలిస్తారు. కర్ణాటకలో ఒక్కో టిప్పర్ రూ.60 వేలకు అమ్ముకుంటున్నారు. ఇలా నియోజకవర్గం నుంచీ కర్ణాటకకు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. వీరంతా ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపణలున్నాయి. ఒక్కో టిప్పర్‌కు రూ.20 వేలు చొప్పున వీరు ఎమ్మెల్యేకి కప్పం కడతారని, తద్వారా ఐదేళ్లలో ఆయన రూ.వంద కోట్లు సంపాదించినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాగే, ఈ ప్రాంతం నుంచి పశువుల కబేలాలు, మట్టి, బియ్యం, ఎర్రచందనం వంటివి అక్రమ రవాణా నుంచీ ఎమ్మెల్యేకు కమీషన్లు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇందిరమ్మ కాలనీలో పట్టాల అమ్మకం



పలమనేరు పట్టణ పరిధిలోని గంటావూరులో 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ సుమారు 8 ఎకరాల్లో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటుచేసి రెండు వేల మందికి పట్టాలిచ్చారు. అక్కడ సగం మంది నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. స్థానికంగా ఇద్దరు మండల స్థాయి మైనార్టీ నాయకులు ఆ కాలనీలో మకాం వేసి ఖాళీ స్థలాలకు ఫేక్ పట్టాల్ని తయారుచేసి అమ్ముకున్నారు. ఒక్కో పట్టాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి.. రూ.కోట్లలో వెనకేసుకున్నారు. ఇందులో ఎమ్మెల్యేకు కూడా వాటా వెళ్లినట్లు సమాచారం.

పెద్దఎత్తున గంజాయి, కర్ణాటక మద్యం

నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో గంజాయి లభ్యత, వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పోలీసుల దాడుల్లో వందల కేజీల్లో గంజాయి దొరుకుతోంది. సమీపాన ఉన్న కర్ణాటక నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లను తెచ్చుకుని వైసీపీ నాయకులు బెల్ట్ షాపుల్లో పెట్టి అమ్ముకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఈ మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజుకు రూ.2 లక్షలు, నెలకు రూ.60 లక్షల అక్రమ వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. గంజాయి, మద్యం కారణంగా స్థానిక యువత పక్కదారి పడుతున్నారు.

స్థలం కనిపిస్తే కబ్జాకు యత్నం

నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనుచరులు రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాల్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఎప్పటికప్పుడు టీడీపీ శ్రేణులు గుర్తించి అడ్డుకున్నారు. పలమనేరు జవిలి వీధిలో మత్స్య శాఖ స్థలాన్ని ఆక్రమించుకుని, తమ వారికి కేటాయించేందుకు ప్రయత్నించారు. దీనిని టీడీపీ శ్రేణులు అడ్డుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడారు.

- మదనపల్లె రోడ్డులో టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. మాజీ మంత్రి అమర్ సమక్షంలో తెలుగు తమ్ముళ్లు తిరగబడడంతో ఈ రోజు ఆ స్థలం మిగిలి ఉంది.
- వి.కోటలో ఉర్దూ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ నిర్మాణానికి టీడీపీ కేటాయించిన రూ.కోట్ల విలువ చేసే స్థలాన్నీ కబ్జాకు యత్నించారు. టీడీపీ శ్రేణులు అడ్డుకోగా.. అమరనాథరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారి ఆక్రమణ ఆగింది.
- గంగవరం మండలం మదనపల్లె ప్రధాన రహదారిలో ఇటీవల వైసీపీ నాయకులు అక్రమ పట్టాలతో రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కొట్టేయాలని చూశారు. టీడీపీ నాయకుల చొరవ.. అధికారులకు ఫిర్యాదు చేయడంతో అది ప్రభుత్వ స్థలమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



మత్స్యశాఖ స్థలాన్ని ఆక్రమించేందుకు తవ్వారిలా.. (ఫైల్ ఫొటో)

- పలమనేరు నడిబొడ్డున ఉన్న శివాలయ భూముల్ని బైరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నేత, అనుచరులు 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. ఇప్పుడు అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇచ్చారు.

మహిళా అధికారితో దురుసు ప్రవర్తన

వి.కోటలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేస్తుండగా, వైసీపీ నాయకులు గ్రానైట్ రాళ్లను సరఫరా చేశారు. ఆమె బిల్లులు అడిగితే ఇవ్వలేదు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కల్పించుకుని రాళ్ల వాహనాన్ని పంపాలని అడిగ్గా మహిళా అధికారి వినలేదు. దీంతో ఆమె పట్ల ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. ఆమె సిబ్బంది మీద దాడి చేశారు. ఆ మహిళా అధికారి ఎమ్మెల్యే మీద కేసు పెట్టేందుకు ప్రయత్నించగా, రాజీ చేశారు.

నిరుపేదలను పీడించారు

పలమనేరు పట్టణంలో ఎంబీటీ రోడ్డు పక్కన దశాబ్దాల కాలంగా పేదలు చిన్న చిన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వాటిని నిబంధనల పేరుతో తొలగించి తమ వారికి కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే మనుషులు అధికారుల మీద ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ పేదలు రూ.లక్షలు ఖర్చు చేసి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవాల్సి వచ్చింది.

మోసం గురూ

- విద్యుత్ సబ్ స్టేషన్లు, ఆస్పత్రులు, వెలుగు కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో చిన్నపాటి ఉద్యోగాలిప్పిస్తామని వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు యువత నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ఎవరైనా నిలదీస్తే ఎమ్మెల్యే పేరు చెప్పి దబాయించేశారు.
- వి.కోట మండలానికి చెందిన ఎమ్మెల్యే అనుచరుల్లోని ఇద్దరు నాయకులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పేరుతో గ్రానైట్ వాహనాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.
- ఇటీవల పుంగనూరులో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేసి, పలమనేరు డిపో నుంచి చాలా బస్సుల్ని అక్కడికి తరలించేశారు. అయినా ఎమ్మెల్యే ప్రేక్షక పాత్ర పోషించారే తప్ప ఏం చేయలేకపోయారు.
- బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఎంపీటీసీ, ఎమ్మెల్యే అనుచరుడు అభినవ్ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.

కరోనా సమయంలోనూ పబ్లిసిటీ పిచ్చి


కరోనా లాక్‌డౌన్ సమయంలో వి.కోట మండలం భారత్‌నగర్‌లో ఓ బ్రిడ్జిని నిర్మించగా, ఎమ్మెల్యే పెద్దఎత్తున జనాలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. కరోనా కారణంగా ప్రజలు బయటికి రాకూడదని నిబంధన ఉన్నా లెక్కచేయకుండా ప్రారంభించడంతో మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్యే మళ్లీ ఆ ప్రాంతానికి వచ్చి హంగామా చేసి, మీడియా వాళ్లను దారుణంగా తిట్టారు. జాతీయ స్థాయిలో ఈయన తీరు గురించి మీడియా తప్పు పట్టింది.

లీడర్స్ వాయిస్

వైసీపీ పనైపోయింది!

"ఇందిరా గాంధీ మరణించి నలభై ఏళ్ళవుతున్నా ఇంకా జనంలో ఆమె పట్ల అభిమానం తగ్గలేదు. పార్టీ ప్రచారంలో భాగంగా వేలమందిని నేరుగా కలిశా. ఇందిరా గాంధీ ఫొటో కనిపించగానే ఇప్పటికీ జనం మొక్కుతున్నారు."

పట్టణాల్లో వాష్ అవుట్
పల్లెల్లో పునాదులు కదిలిపోయాయి
కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్



తిరుపతి, ఆంధ్రజ్యోతి

అపారమైన అనుభవంగల నాయకుడు చింతా మోహన్. 1984 నుంచీ 2021 దాకా తిరుపతి లోక్‌సభ స్థానానికి 11 సార్లు ఎన్నికలు జరిగితే, పదిసార్లు ఆయన బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి ఒకసారి, కాంగ్రెస్ నుంచి ఐదు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రిగా చేశారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా నిరంతరం జనంలో తిరుగుతూ ఉండే చింతామోహన్ 11వ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా తిరుపతి నుంచి పోటీ చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ వర్తమాన పరిణామాలపై చింతా మోహన్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని కొన్ని ముఖ్యాంశాలు..

వైసీపీకి 30 సీట్లు లోపే

ఈ ఎన్నికల్లో తిరుపతిలో అధికార పార్టీ పనైపోయింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు. అందుకే ఇంతకు మించి చెప్పలేను. రాష్ట్రం మొత్తం మీద ఆ పార్టీ పరిస్థితి గురించి చెప్పాల్సి వస్తే నగర, పట్టణ ప్రాంతాల్లో వైసీపీ ఇప్పటికే తుడిచి పెట్టుకుపోయింది. ఎంతో కొంత గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకున్న బలమైన పునాదులు కూడా దెబ్బతిన్నాయి. జగన్‌కు రెండో ఛాన్సు ఇవ్వడానికి జనం సిద్ధంగా లేరు. 175 సీట్లకుగానూ ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి 30 సీట్లకు మించి రావు.

మా ఓట్‌షేర్ వైసీపీ నుంచే

కాంగ్రెస్ పుంజుకోవడం వెనుక వైఎస్ షర్మిల ప్రభావం కొంత మేరకు వుంది. కాంగ్రెస్ ఓటు షేర్ ఖచ్చితంగా పెరిగింది.ఆ ఓటు షేర్ వైసీపీ నుంచే లాక్కుంటున్నాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకు కావడం వల్ల కాంగ్రెస్, జగన్ ఒకటే అని గ్రామీణజనం నమ్ముతూ వచ్చారు. జగన్ వేరు, కాంగ్రెస్ వేరు అనే అభిప్రాయం ఇప్పుడు ప్రజల్లో కలిగిస్తున్నాం.

ధరల దోపిడీ

నిత్యావసర వస్తువులు, సేవల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దానికి తోడు అధిక పన్నులతో జనం దోపిడీకి గురవుతున్నారు. నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతోంది. ప్రజలకు ఏమి అవసరమో, వారు ఏమి కోరుకుంటున్నారో గ్రహించడంలో వైసీపీ, తెలుగుదేశం పార్టీలు విఫలమయ్యాయి.

ఎంపీగా తిరుపతికి రూ. లక్ష కోట్లు తెచ్చా!

ఎంపీగా సుదీర్ఘకాలం పనిచేసినప్పటికీ కేవలం పదేళ్ళ యూపీఏ ప్రభుత్వ హయాంలోనే తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి రూ. లక్ష కోట్లు కేంద్రం నుంచీ తెచ్చా.తిరుపతి-చెన్నై,తిరుపతి-కొచ్చిన్, తిరుపతి-బెంగుళూరు, తిరుపతి-అనంతపురం, తిరుపతి-నాయుడుపేట, తిరుపతి-కడప-కర్నూలు-హైదరాబాదు, తిరుపతి-ఏర్పేడు-వెంకటగిరి మీదుగా మహారాష్ట్ర... ఇలా ఏడు జాతీయ రహదారులు మంజూరు చేయించా. కిలోమీటరుకు రూ. 20 కోట్లు చొప్పున 3500 కిలోమీటర్ల ఈ రహదారులకు అప్పట్లోనే రూ. 70 వేల కోట్లు విడుదల చేయించా. మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ జాయింట్ ప్రాజెక్టుకు రూ. 8 వేల కోట్లు మంజూరు చేయించడంతో పాటు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో శంకుస్థాపన కూడా చేయించా. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు రూ. 10 వేల కోట్లు క్యాబినెట్‌లో అప్రూవ్ చేయించి పార్లమెంటులో బిల్లు పెట్టించా. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని చేసిన.. ఇంత నిధులు కేంద్రం నుంచి సాధించిన ఒక్క ఎంపీ పేరును ఎవరైనా చెప్పగలరా?

తిరుపతికి అంతర్జాతీయ స్థాయి

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయిని అందుకోవడం వెనుక నా కృషి వుంది. అంతే కాదు ఐఐఎస్ఈఆర్, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థలను విభజన చట్టంలో పెట్టించి రాష్ట్రానికి వచ్చేందుకు కారకుడినయ్యా. తిరుపతి-కాట్పాడి మీటర్ గేజ్ రైల్వే లైన్‌ను బ్రాడ్ గేజిగా మార్పించా. అలాగే గూడూరు రైల్వే లైన్‌ను డబుల్ లైన్ చేయించా. తిరుపతికి గతంలో రోజువారీ పది రైళ్ళు మాత్రమే వచ్చేవి. అలాంటిది వాటి సంఖ్య ఏకంగా 60కి పెంచా.

స్విమ్స్ ప్రైవేటుపరం కాకుండా కాపాడా!

2005లో తిరుపతి స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అపోలో సంస్థకు అమ్మకానికి పెట్టారు. ఆ విషయం తెలుసుకుని స్విమ్స్‌కు ఆర్థిక పరిపుష్టి కోసం రూ. వంద కోట్లు కేటాయించాలని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌పై ఒత్తిడి తెచ్చాను. అయితే ప్రధాని రూ. 60 కోట్లు ఇచ్చారు.దానివల్లే స్విమ్స్ ప్రైవేటు పరంకాకుండా నిలబడింది.సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందించగలుగుతోంది. అంతే కాకుండా స్విమ్స్ ఆధ్వర్యంలో 300 పడకల చిన్నపిల్లల ఆస్పత్రిని, అలాగే 300 పడకల మెటర్నిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించా. ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల పెంచేందుకు కృషి చేశా. జిల్లా నుంచీ మామిడిని విదేశాలకు ఎగుమతి చేయడానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయించా. ఈ ప్రభుత్వం దాన్ని ప్రైవేటుపరం చేసింది. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పదిహేను ఆలయాల అభివృద్ధికి హెరిటేజ్ టూరిజం ప్రాజెక్టు ప్రతిపాదించి కేంద్రం నుంచీ రూ.వంద కోట్లు విడుదల చేయించేందుకు ప్రయత్నించా. అయితే కేంద్రం రూ.47కోట్లు కేటాయించడంతో ఆ నిధులను కాణిపాకం నుంచీ పెంచలకోన దాకా, అలాగే నెల్లూరులో రంగనాథస్వామి ఆలయానికి కూడా విడుదల చేయించా.

అవకాశమిస్తే చేయాల్సింది ఎంతో వుంది!

తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నేను పునాది వేయిస్తే దాన్ని జరగనివ్వకుండా ఆపేశారు. తిరుపతిలోనే రూ.292 కోట్లతో ఏడు వేలమందికి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు మంజూరు చేయిస్తే ఆ ప్రాజెక్టును కూడా ఆపేశారు.దుగరాజపట్నం పోర్టు వస్తే సూళ్ళూరుపేట, నాయుడుపేట, గూడూరు, పెళ్ళకూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భూములకు విలువ పెరుగుతుంది. ఆ ప్రాంత రైతులకు మంచి జరుగుతుంది. ఉద్యోగావకాశాలు కూడా వస్తాయి. తిరుపతిలో ఎస్వీ జూపార్కు ఏడు వేల ఎకరాల్లో విస్తరించి వుంది. జూ పార్కును అక్కడినుంచీ భాకరాపేట లేదా పుత్తూరు వైపు తరలిస్తే ఆ ఏడు వేల ఎకరాలు పేద, మధ్య తరగతి, ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కోసం కేటాయించడానికి అవకాశముంటుంది. అలాగే అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత భూములిస్తే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎందుకు రావు?

శ్రీకాళహస్తి
సత్యవేడు

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్

శ్రీకాళహస్తి, మే 6: శ్రీకాళహస్తి పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం పార్లమెంట్ ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రవి శంకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, తహసీల్దార్ జనార్దన రాజు, స్ట్రాంగ్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు: స్థాని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పెసిలిటేషన్ కేంద్రాన్ని, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం కమిషనింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో వసతులు, పోలింగ్ సరళి తదితర వివరాలను ఎన్నికల అధికారి నరసింహులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ రామాంజనేయులు, అలీఖాన్, ఎంపీడీవో, సర్వే, స్ట్రాంగ్ రూం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

శ్రీకాళహస్తి, మే 6: శ్రీకాళహస్తిలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని స్కిట్ కళాశాలలో రెండవ రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగింది. తొలిరోజు 1592 మంది, రెండవ రోజు 607 మంది ఓటు వేశారు. మొత్తం 2367 మంది దరఖాస్తు చేసుకోగా, 2199 ఓట్లు పోల్ అయినట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి వెల్లడించారు.

సత్యవేడులో 88 శాతం పోలింగ్

సత్యవేడు: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో రెండో రోజు సోమవారం సత్యవేడులో 88 శాతం పోలింగ్ నమోదైనట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు తెలిపారు. మొత్తం 1206 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1366 ఉండగా, ఆదివారం 779 మంది, సోమవారం 426 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రూ.90 లక్షల బంగారం స్వాధీనం

పిచ్చాటూరు, మే 6: పిచ్చాటూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద రూ.90 లక్షల విలువ చేసే బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలసి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న బస్సులో ఓ ప్రయాణికుడి వద్ద రూ.90 లక్షల విలువ చేసే బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతికి చెందిన కాశీ జ్యువెలరీస్ నుంచి వ్యాపార లావాదేవీల నిమిత్తం తీసుకెళుతున్నట్లు రసీదులు చూపడంతో సేల్ టాక్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. జీఎస్టీ ఆన్‌లైన్‌లో కాకుండా మ్యాన్యువల్‌గా చెల్లించినట్లు గుర్తించి రూ.5లక్షల 35వేలు జరిమానా విధించారు.

నైపుణ్య ఆధారిత విద్యకు సీబీఎస్ఈ పెద్దపీట



అవగాహన కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులతో ఐఐటీ డైరెక్టర్

ఏర్పేడు, మే 6: నైపుణ్య ఆధారిత విద్యకు సీబీఎస్ఈ పెద్దపీట వేస్తుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో సోమవారం సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 50మంది హాజరయ్యారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ సీబీఎస్ఈ విద్య రానున్న రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తుకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రయోగాత్మకంగా, పరిశీలనాత్మకంగా ఉండే సీబీఎస్ఈ విధానం ఉన్నత విద్యలో ప్రవేశించే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

గోపాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం



తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 6: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం ఊరందురులోని గోపాలకృష్ణారెడ్డి సమాధి వద్ద ఆయన సతీమణి బృందమ్మ, కుమారుడు బొజ్జల సుధీర్ రెడ్డి, కోడలు రిషిత రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గోపాలకృష్ణారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా వచ్చిన గోపాల కృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా లఘు చిత్రంగా ప్రదర్శించారు.

ఆసరా సొమ్ము జమ కాలేదని నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

వరదయ్యపాళెం, మే 6: బటన్ నొక్కి మూడు నెలలు గడుస్తున్నామా ఆసరా సొమ్ము తమ ఖాతాల్లో జమ కాలేదని కువ్వాకొల్లి డ్వాక్రా సంఘాల మహిళలు సోమవారం వరదయ్యపాళెం వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా సంఘాలకు నగదు జమ చేసేందుకు సీఎం జగన్ బటన్ నొక్కి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు దుర్గాబాయ్, వెంకయ్యస్వామి సంఘాల ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘమిత్రను అడిగితే సమాధానం చెప్పలేదన్నారు. వరదయ్యపాళెం చేరుకుని వెలుగు కార్యాలయం అధికారులకు విన్నవించగా వారుసైతం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో నిరసన తెలిపామని చెప్పారు. దుర్గాబాయ్ సంఘాన్ని 25 సంవత్సరాలుగా నడుపుతున్నామని, సభ్యులకు రూ.1.25లక్షలు, 17 ఏళ్లుగా నడుపుతున్న వెంకయ్యస్వామి సంఘానికి రూ.84వేలు రావాల్సి ఉందన్నారు. తమ సంఘాలకు నగదు జమ కాకపోతే ఎన్నికల్లో ఓటుతో సమాధానం చెబుతామని వారు స్పష్టం చేశారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

రేణిగుంట, మే 6: నీటి ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం రేణిగుంట పట్టణంలోని రామకృష్ణపురం కూడలి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... స్థానిక వేణుగోపాలపురానికి చెందిన రాఘవేంద్ర(30) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నీటిట్యాంకర్ ఢీకొంది. తలకు తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

నాగలాపురం, మే 6: మండల పరిధిలోని బైటకొడియంబేడు గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. బైట కొడియంబేడు గ్రామానికి చెందిన బాలాజీ తన కుమారుడు ప్రసాద్(12)తో కలిసి ద్విచక్ర వాహనంపై గ్రామంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా ఊత్తుకోట నుంచి పుత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రసాద్ అక్కడిక్కడే మృతి చెందగా బాలాజీ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారులో ఉన్న వారు వాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యారు. ఎస్‌ఐ ఓబయ్య సంఘటనా స్థలాన్ని చేరుకుని కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాజీవ్ నగర్‌లో భూకబ్జాలకు అంతం పలకండి



రాజీవ్ నగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 6: ఓటు ఆయుధంతో రాజీవ్ నగర్ కాలనీని పీడిస్తున్న భూకబ్జాలకు అంతం పలకాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో సోమవారం సుధీర్ రెడ్డి ప్రచారం చేశారు. స్థానికులు భారీ గజమాలలను, మంగళ హారతులతో స్వాగతం పలికారు. భూ కబ్జాదారుల చెరతో రాజీవ్ నగర్ కాలనీ ఐదేళ్ల నుంచి అల్లాడిపోయిందంటూ స్థానికులు వాపోయారు. తమ కాలనీలో కనీస సౌకర్యాలు మెరుగు పరచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూ బకాసురులు బాధితులుగా మిగిలిపోయామంటూ పలువురు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులతో నలిగిపోయిన బాధితులు తమ సమస్యను విన్నవించారు. బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... తన తండ్రి దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నిరుపేదల కోసం కేటాయించిన రాజీవ్ నగర్ కాలనీ ఇళ్ల స్థలాలను కంటికి రెప్పలా కాపాడారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజీవ్ నగర్ లోని పేదల ఇళ్ల స్థలాలు కబ్జాలకు గురికాకుండా అధికారులతో విస్తృతంగా సర్వే చేయించి రక్షించారని తెలిపారు. వైసీపీ నేతలు కొందరు అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఉసురుతోనే పైశాచిక వైసీపీ అంతం అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే అభ్యర్థిగా సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా అమలు చేయబోయే సరికొత్త సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే శ్రీకాళహస్తిలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్థానికంగా చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు. రాజీవ్ నగర్ కాలనీలో అక్రమార్కులపై ఉక్కు పాదం మోపి భూకబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని మామండూరు గ్రామానికి చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి బొజ్జల సుధీర్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సర్పంచు జయమ్మ, ఉప సర్పంచు మురగయ్య, ఐదుగురు వార్డు మెంబర్లు ఉన్నారు. అలాగే ఎలమండ్యం పంచాయతీ సీడబ్ల్యూసీ గోదాం, కరకంబాడీ పంచాయతీ పరిధిలో పలువురు సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

ఎవరూ చేయని అభివృద్ధి చేసి చూపిస్తా: వరప్రసాద్



గ్రామస్తులతో వెలగపల్లి వరప్రసాద రావు - పాశం సునీల్‌కుమార్‌తో కలిసి వరప్రసాద్ ఎన్నికల ప్రచారం

సూళ్లూరుపేట/వాకాడు, మే 6: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరూ చేయనటువంటి అభివృద్ధి చేసి చూపిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు పంచాయతీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పాలకులు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. తీర ప్రాంతాల్లో మౌలిక వసతులు దారుణంగా ఉన్నాయన్నారు. తాను గెలిచిన వెంటనే ఏడాది లోగా పులికాట్ సరస్సు ముఖద్వారాన్ని పూడిక తీయించడమే కాకుండా మెరుగైన రోడ్లను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఎంపీ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. సాగునీటి సమస్య పరిష్కరిస్తానని, అటవీ ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అవినీతి, అక్రమాలే ధ్యేయంగా పనిన ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, రామమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, రాజసులోచనమ్మ, మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిట్టమూరు, వాకాడుల్లో...

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు వాకాడు, చిట్టమూరు మండల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ టీడీపీ నాయకురాలు పనబాక లక్ష్మితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేద్దాం: ఆదిమూలం

నాగలాపురం, మే 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దామని ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. సోమవారం సురుటుపల్లి, కారణి, చిన్నాపట్టు, సుబ్బానాయుడు కండ్రిగ, నందనం, బైటకొడియంబేడు, నాగలాపురం గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.



సుబ్బానాయుడు కండ్రిగలో పర్యటిస్తుతన్న ఎమ్మెల్యే ఆదిమూలం

బొజ్జల కుటుంబంతోనే శ్రీకాళహస్తి అభివృద్ధి



గోపాల కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లమాల సుధాకర్ - బృందమ్మతో మాట్లాడుతూ

శ్రీకాళహస్తి, మే 6: బొజ్జల కుటుంబంతోనే శ్రీకాళహస్తి అభివృద్ధి సాధ్యమని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ సీనియర్ నాయకులు పలమాల సుధాకర్ అన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఊరందూరులోని ఆయన స్వగృహానికి చేరుకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బొజ్జల బృందమ్మతో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు గోపాలకృష్ణారెడ్డి చేసిన కృషిని కొనియాడారు. గోపాలన్న ఆశయాలు కొనసాగాలంటే ఆయన తనయుడు బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లమాల శశాంక్, బీజే ప్రసాద్, పగడాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

9మంది హోం ఓటింగ్

వరదయ్యపాళెం, మే 6: వరదయ్యపాలెం మండలంలో 85 సంవత్సరాలు పైబడిన 9మంది వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి ఇంటి వద్దకే అధికారులు వెళ్లి రహస్య పద్ధతిలో ఓటు వేయించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని దీనిని వీడియో తీశారు.

జీతాలు ఇవ్వాలని పారిశుధ్య కార్మికుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, మే 6: మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు జీతాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 24 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. అనేక మార్లు నిరసన కార్యక్రమాలు చేపడితే కొందరికి మాత్రమే జీతాలు ఇచ్చారని చెప్పారు. అనంతరం ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మే 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి సోమవారంప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలోని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమంత్రాలతో దూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిధుల గోల్‌మాల్‌పై డీఎంహెచ్‌వో విచారణ

వరదయ్యపాళెం, మే 6: మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిధుల దుర్వినియోగంపై డీఎంహెచ్‌వో శ్రీహరి సోమవారం విచారణ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి బిల్లులు స్వాహా చేశారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో వైద్యాధికారులు అనిత, లావణ్యను డీఎంహెచ్‌వో విచారించారు. గ్రామాల్లో సేవలు అందించేందుకు నెలకు రూ.3వేలు చొప్పు ఇస్తారు. ఇందుకు సంబంధించి 14నెలలకు రూ.43వేలు ఉన్నతాధికారుల అనుమతితో డ్రా చేయాల్సి ఉండగా వైద్యాధికారులు లావణ్య, అనిత రూ.1.60లక్షలు డ్రా చేసినట్లు సమాచారం. ప్రాథమిక విచారణ అనంతరం వైద్యాధికారుల చెక్‌పవర్ రద్దు చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయి విచారణ తరువాత శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు గాలం

సత్యవేడు, మే 6: సత్యవేడులో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో ప్రలోభాల పర్వానికి తెరలేచింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ పోలింగ్ కేంద్రంలో తొలి రోజు ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకోగా, రెండో రోజు సోమవారం అంగన్‌వాడీ, ఆర్టీసీ, ఇతర అత్యవసర సేవల సిబ్బంది ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, అధికార పార్టీ నాయకులు పోలింగ్ కేంద్రం సమీపంలోనే నిలబడి బహిరంగంగా ఓటర్లకు డబ్బులు పంచుతూ కనిపించడం విమర్శలకు దారి తీసింది. పోలింగ్ కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఓటరు లిస్టు దగ్గర పెట్టుకుని యథేచ్ఛగా పంపకాలు చేస్తున్నా పోలీసులు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు సైతం పోలింగ్ కేంద్రం ఎదురుగానే ఓ దుకాణంలో మకాం వేసి పంపకాలు చేపట్టారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం

శ్రీకాళహస్తి, మే 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పలమాల సుధాకర్ రూ.5లక్షలు విరాళంగా సమర్పించారు. సోమవారం ముక్కంటి ఆలయ పరిపాలనా భవనంలో ఈవో నాగేశ్వరరావును కలిసి విరాళం అందజేశారు. కార్యక్రమంలో పల్లమాల మంజులా నాయుడు, పల్లమాల శశాంక్, బీజే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, రేణిగుంట బ్రాంచి -1 మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు రోడ్డు, పద్మావతిపురం, ఇం.నెం. 7-45/1రులో కాపురముండు లేట్ కె.సుబ్రమణ్యం గారి కుమారుడు కె.మనోజ్ కుమార్ గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు కె. కిషోర్ కుమార్ గారి భార్య కె. గీత గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినము లలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : తిరుపతి డిస్ట్రిక్ట్, తిరుపతి రూరల్ సబ్ డిస్ట్రిక్ట్, తిరుపతి రూరల్ మండలం, వేమూరు గ్రామ రెవిన్యూదాఖలాలో సర్వే నెంబరు 422/581 లో విస్తీర్ణం ఎ.0-68 సెంట్లున్ను, సర్వే నెంబరు 422/1ఎ లో విస్తీర్ణం ఎ.0-20 సెంట్లున్ను, సర్వే నెంబరు 422/5ఎ లో విస్తీర్ణం ఎ.0-07 సెంట్లున్ను మరియు సర్వే నెంబరు423/9బి1 లో విస్తీర్ణం ఎ.0-42 సెంట్లున్ను, వెరసి మొత్తం విస్తీర్ణం ఎ.1-37 సెంట్లు గల భూమిని తదుపరి Proceedings of The Competent Authority and Revenue Divisional Officer, Tirupati - District, Tirupati Division Proceeding No.C/1300/2022, Dated:27-12-2022 ద్వారా వ్యవసాయ భూమి నుండి వ్యవసాయేతర భూమిగా మార్పు చేయబడిన (Land Conversion) భూములలో -సర్వే నెంబరు422/5బి1 లో విస్తీర్ణం ఎ.0-68 సెంట్లు గల భూమిలో "శ్రీ అక్షయ గ్రీన్ గార్డెన్స్" అను పేరిట మేము వేసియుండు లే-అవుట్ ప్లాట్లులో ఈ దినం నీకు మేము విక్రయించిన ప్లాట్ నెంబరు5 గల ఖాళీ జాగాకు హద్దులు, కొలతలు వివరములు :- తూర్పు : డి. మురగేశ్, డి.మోహన్ వీర్ల భూమి, పడమర : 30 అడుగులు వెడల్పు గల లే అవుట్ రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెంబరు 4 గల జాగా, దక్షిణం : ప్లాట్ నెంబరు 6 గల జాగా. యీ నాలుగు హద్దులు మధ్యన - తూర్పు నుండి పడమర వరకు ఉత్తరము వైపు అ॥ 32' - 6" లేక మీ॥ 9.912, తూర్పు నుండి పడమర వరకు దక్షిణము వైపు అ॥ 30'-9" లేక మీ॥ 9.378, ఉత్తరము నుండి దక్షిణము వరకు ఇరువైపుల అడుగులు 36' - 0" లేక మీటర్లు 10.980, మార్కు 1138.5 చదరపు అడుగులు లేక 126.5 చదరపు గజములు గల 31.625 అంకణములు కలిగిన ఖాళీ పూరా హక్కుతో సహా ఈ దినం నీకు మేము సర్వసంపూర్ణ హక్కులతో విక్రయించి నీకు స్వాధీనము చేయడమైనది. సదరు ఆస్తి వేమూరు గ్రామ పంచాయితీ పరిధిలో కలదు.

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం.8-114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

పుత్తూరు వార్తలు

టీడీపీలో చేరిన యువత

వడమాలపేట, మే 6: వడమాలపేటకు చెందిన పలువురు యువకులు టీడీపీలో చేరారు. వారికి గాలి భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఢిల్లీ ప్రసాద్, ధనంజయులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

పుత్తూరు టౌన్, మే 6: పట్టణంలోని రాస్ కార్యాలయంలో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు నెలలు పాటు ఉచిత కంప్యూటర్స్, టైలరింగ్, ఆర్యా, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు యూనియన్ బ్యాంకు మేనేజర్ తులసీరామ్ చేతుల మీదుగా అందజేశారు. జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ హరి, రాస్ అధికారి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్: భాను




గేటు పుత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మే 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని గేటు పుత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదలియార్ సామాజిక వర్గానికి కోడలు అని చెప్పి ఓట్లు వేయించుకున్న రోజా ఆ వర్గానికి ఏమైనా చేసిందా అని నిలదీశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పెంచిన విద్యుత్ చార్జీలతో పవర్‌లూమ్స్ పరిశ్రమ కుదేలైందని ధ్వజమెత్తారు. రోజా మాయమాటలు నమ్మి మరోసారి ఓటేస్తే ఏకంగా ఇళ్లు, వాకిలి అమ్ముకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చంద్రబాబు నగరి పర్యటనకు వచ్చినప్పుడు, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ ఇస్తానని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు 50 ఏళ్లు నిండిన మొదలియార్లకు నెలకు రూ.4 వేలు పింఛను అందించే బాధ్యత తనదని వాగ్దానం చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని అభ్యర్థించారు. డీఎస్ ఏలుమలై, కరుణాకరన్, యుగంధర్, అంకయ్య, డీఎస్ గణేష్, రాధా అశోక్, ఆనంద్, గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, అన్బు, డీజీ ధనపాల్, లక్ష్మీపతి, జి.బాబు, వెంకటముని పాల్గొన్నారు.

లీడర్స్ వాయిస్

వైసీపీ పనైపోయింది!

పట్టణాల్లో వాష్ అవుట్
పల్లెల్లో పునాదులు కదిలిపోయాయి
కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్



"ఇందిరా గాంధీ మరణించి నలభై ఏళ్ళవుతున్నా ఇంకా జనంలో ఆమె పట్ల అభిమానం తగ్గలేదు. పార్టీ ప్రచారంలో భాగంగా వేలమందిని నేరుగా కలిశా. ఇందిరా గాంధీ ఫొటో కనిపించగానే ఇప్పటికీ జనం మొక్కుతున్నారు."

తిరుపతి, ఆంధ్రజ్యోతి

అపారమైన అనుభవంగల నాయకుడు చింతా మోహన్. 1984 నుంచీ 2021 దాకా తిరుపతి లోక్‌సభ స్థానానికి 11 సార్లు ఎన్నికలు జరిగితే, పదిసార్లు ఆయన బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి ఒకసారి, కాంగ్రెస్ నుంచి ఐదు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రిగా చేశారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా నిరంతరం జనంలో తిరుగుతూ ఉండే చింతామోహన్ 11వ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా తిరుపతి నుంచి పోటీ చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ వర్తమాన పరిణామాలపై చింతా మోహన్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని కొన్ని ముఖ్యాంశాలు..

వైసీపీకి 30 సీట్లు లోపే

ఈ ఎన్నికల్లో తిరుపతిలో అధికార పార్టీ పనైపోయింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు. అందుకే ఇంతకు మించి చెప్పలేను. రాష్ట్రం మొత్తం మీద ఆ పార్టీ పరిస్థితి గురించి చెప్పాల్సి వస్తే నగర, పట్టణ ప్రాంతాల్లో వైసీపీ ఇప్పటికే తుడిచి పెట్టుకుపోయింది. ఎంతో కొంత గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకున్న బలమైన పునాదులు కూడా దెబ్బతిన్నాయి. జగన్‌కు రెండో ఛాన్సు ఇవ్వడానికి జనం సిద్ధంగా లేరు. 175 సీట్లకు గానూ ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి 30 సీట్లకు మించి రావు.

మా ఓట్‌షేర్ వైసీపీ నుంచే

కాంగ్రెస్ పుంజుకోవడం వెనుక వైఎస్ షర్మిల ప్రభావం కొంత మేరకు వుంది. కాంగ్రెస్ ఓటు షేర్ ఖచ్చితంగా పెరిగింది.ఆ ఓటు షేర్ వైసీపీ నుంచే లాక్కుంటున్నాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకు కావడం వల్ల కాంగ్రెస్, జగన్ ఒకటే అని గ్రామీణజనం నమ్ముతూ వచ్చారు. జగన్ వేరు, కాంగ్రెస్ వేరు అనే అభిప్రాయం ఇప్పుడు ప్రజల్లో కలిగిస్తున్నాం.

ధరల దోపిడీ

నిత్యావసర వస్తువులు, సేవల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దానికి తోడు అధిక పన్నులతో జనం దోపిడీకి గురవుతున్నారు. నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతోంది. ప్రజలకు ఏమి అవసరమో, వారు ఏమి కోరుకుంటున్నారో గ్రహించడంలో వైసీపీ, తెలుగుదేశం పార్టీలు విఫలమయ్యాయి.

ఎంపీగా తిరుపతికి రూ. లక్ష కోట్లు తెచ్చా!

ఎంపీగా సుదీర్ఘకాలం పనిచేసినప్పటికీ కేవలం పదేళ్ళ యూపీఏ ప్రభుత్వ హయాంలోనే తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి రూ. లక్ష కోట్లు కేంద్రం నుంచీ తెచ్చా.తిరుపతి-చెన్నై,తిరుపతి-కొచ్చిన్, తిరుపతి-బెంగుళూరు, తిరుపతి-అనంతపురం, తిరుపతి-నాయుడుపేట, తిరుపతి-కడప-కర్నూలు-హైదరాబాదు, తిరుపతి-ఏర్పేడు-వెంకటగిరి మీదుగా మహారాష్ట్ర.. ఇలా ఏడు జాతీయ రహదారులు మంజూరు చేయించా. కిలోమీటరుకు రూ. 20 కోట్లు చొప్పున 3500 కిలోమీటర్ల ఈ రహదారులకు అప్పట్లోనే రూ. 70 వేల కోట్లు విడుదల చేయించా. మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ జాయింట్ ప్రాజెక్టుకు రూ. 8 వేల కోట్లు మంజూరు చేయించడంతో పాటు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో శంకుస్థాపన కూడా చేయించా. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు రూ. 10 వేల కోట్లు క్యాబినెట్‌లో అప్రూవ్ చేయించి పార్లమెంటులో బిల్లు పెట్టించా. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని చేసిన.. ఇంత నిధులు కేంద్రం నుంచి సాధించిన ఒక్క ఎంపీ పేరును ఎవరైనా చెప్పగలరా?

తిరుపతికి అంతర్జాతీయ స్థాయి

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయిని అందుకోవడం వెనుక నా కృషి వుంది. అంతే కాదు ఐఐఎస్ఈఆర్, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థలను విభజన చట్టంలో పెట్టించి రాష్ట్రానికి వచ్చేందుకు కారకుడినయ్యా. తిరుపతి-కాట్పాడి మీటర్ గేజ్ రైల్వే లైన్‌ను బ్రాడ్ గేజిగా మార్పించా. అలాగే గూడూరు రైల్వే లైన్‌ను డబుల్ లైన్ చేయించా. తిరుపతికి గతంలో రోజువారీ పది రైళ్ళు మాత్రమే వచ్చేవి. అలాంటిది వాటి సంఖ్య ఏకంగా 60కి పెంచా.

స్విమ్స్ ప్రైవేటుపరం కాకుండా కాపాడా!

2005లో తిరుపతి స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అపోలో సంస్థకు అమ్మకానికి పెట్టారు. ఆ విషయం తెలుసుకుని స్విమ్స్‌కు ఆర్థిక పరిపుష్టి కోసం రూ. వంద కోట్లు కేటాయించాలని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌పై ఒత్తిడి తెచ్చాను. అయితే ప్రధాని రూ. 60 కోట్లు ఇచ్చారు.దానివల్లే స్విమ్స్ ప్రైవేటు పరంకాకుండా నిలబడింది.సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందించగలుగుతోంది. అంతే కాకుండా స్విమ్స్ ఆధ్వర్యంలో 300 పడకల చిన్నపిల్లల ఆస్పత్రిని, అలాగే 300 పడకల మెటర్నిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించా. ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల పెంచేందుకు కృషి చేశా. జిల్లా నుంచీ మామిడిని విదేశాలకు ఎగుమతి చేయడానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయించా. ఈ ప్రభుత్వం దాన్ని ప్రైవేటుపరం చేసింది. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పదిహేను ఆలయాల అభివృద్ధికి హెరిటేజ్ టూరిజం ప్రాజెక్టు ప్రతిపాదించి కేంద్రం నుంచీ రూ.వంద కోట్లు విడుదల చేయించేందుకు ప్రయత్నించా. అయితే కేంద్రం రూ.47కోట్లు కేటాయించడంతో ఆ నిధులను కాణిపాకం నుంచీ పెంచలకోన దాకా, అలాగే నెల్లూరులో రంగనాదస్వామి ఆలయానికి కూడా విడుదల చేయించా.

అవకాశమిస్తే చేయాల్సింది ఎంతో వుంది!

తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నేను పునాది వేయిస్తే దాన్ని జరగనివ్వకుండా ఆపేశారు. తిరుపతిలోనే రూ.292 కోట్లతో ఏడు వేలమందికి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు మంజూరు చేయిస్తే ఆ ప్రాజెక్టును కూడా ఆపేశారు.దుగరాజపట్నం పోర్టు వస్తే సూళ్ళూరుపేట, నాయుడుపేట, గూడూరు, పెళ్ళకూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భూములకు విలువ పెరుగుతుంది. ఆ ప్రాంత రైతులకు మంచి జరుగుతుంది. ఉద్యోగావకాశాలు కూడా వస్తాయి. తిరుపతిలో ఎస్వీ జూపార్కు ఏడు వేల ఎకరాల్లో విస్తరించి వుంది. జూ పార్కును అక్కడినుంచీ భాకరాపేట లేదా పుత్తూరు వైపు తరలిస్తే ఆ ఏడు వేల ఎకరాలు పేద, మధ్య తరగతి, ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కోసం కేటాయించడానికి అవకాశముంటుంది. అలాగే అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత భూములిస్తే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎందుకు రావు?

ఓటర్లు లేక వెలవెలబోయిన పోలింగ్ కేంద్రం

తిరుపతి(వైద్యం), మే 6: పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో రెండో రోజు సోమవారం ఓటు వేసేందుకు ఉద్యోగులు రాక వెలవెల బోయింది. పోలింగ్ కేంద్రంలో మొదటిరోజు ఆదివారం బ్యాలెట్ ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు సరైన వసతులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. అయితే సోమవారం నాటికి పూర్తి స్థాయిలో ఓటర్లకు ఎండ తగలకుండా షామియానాలు, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. అలాగే తోపులాటలు జరగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అయితే ఉద్యోగులు అధిక సంఖ్యలో మొదటిరోజునే వారి ఓటు హక్కును వినియోగించుకోవడంతో సోమవారం అరకొరగానే వచ్చారు.

ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో వాగ్వాదం

మంగళం: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో తొలిసారిగా ఓటు వేసేందుకు వచ్చిన పుంగనూరుకు చెందిన టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ తన ఓటు లేకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు సర్ది చెప్పడంతో వెనుదిరిగి వెళ్లాడు. ఇదే తరహాలో కొందరు ఉద్యోగులు తమ ఓటు లేదంటూ అధికారులను ప్రశ్నించడం కనిపించింది. ఇలా చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.



అధికారులతో టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ వాగ్వాదం

పోస్టల్ వినియోగాన్ని పర్యవేక్షించిన కలెక్టర్

తిరుపతి రూరల్: ఎస్వీఆర్ట్స్ కళాశాల, పద్మావతి మహిళా వర్సిటీ, ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ ప్రాంగణాల్లో సోమవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగాన్ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోలీసు బందోబస్తు, మౌలిక సదుపాయాలను కల్పించామని చెప్పారు. ఇతరజిల్లాలో ఓటు హక్కు కలిగి మన జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఎక్స్ఛేంజ్ ఆఫ్ బ్యాలెట్ సౌకర్యం కింద పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకునేలా కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామని వివరించారు.



మహిళా యూనివర్సిటీలో ఓటర్లు రాక వెలవెలబోతున్న పోలింగ్ కేంద్రం క్యూలైన్లు

ఎన్నికల సిబ్బంది ఆకలి కేకలు

తిరుపతి అర్బన్, మే 6: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఎనిమిది పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడే స్ట్రాంగ్‌రూమ్, ఈవీఎంల తనిఖీలు, ఆర్వో పర్యవేక్షణ వంటి కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. దీంతో సుమారు 500మంది సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. మూడు రోజులుగా ఎన్నికల, బందోబస్తు సిబ్బంది కూడా అక్కడే ఉంటున్నారు. ఈసీ ఆదేశాల మేరకు వీరికి సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ సమయానికి వీరికి ఆహారం అందక, తాగునీరు సరఫరా లేక, ఎండతీవ్రతకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. షుగర్, బీపీల బాధితుల పరిస్థితి దారుణంగా తయారైంది. టాయిలెట్ల కొరత ఉండడంతో ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి దాపురించింది. ఆదివారం అర్ధరాత్రికి భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేయడంతో సిబ్బంది తీవ్ర అసహనం చెందినట్లు సమాచారం. అదే సమయంలో అధికారులకు మాత్రం అన్ని ఏర్పాట్లు చేశారన్న ఆరోపణలొచ్చాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), మే 6: తనపల్లె క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంఆర్‌పల్లె ఎస్‌ఐ షేక్షావలి తెలిపిన వివరాల మేరకు.. అప్పలాయగుంటకు చెందిన అజయ్‌సాయి (22) తన స్నేహితుడు శంకరయ్య కుమారులు ధనుష్, వర్షిత్‌లను తీసుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతి నుంచి అప్పలాయగుంట సమీపంలోని యనమలపాలెంకు వెళుతున్నాడు. ఈ క్రమంలో తనపల్లె క్రాస్ వద్దకు వెళ్లగానే అతివేగంగా వస్తున్న అమర రాజా కంపెనీ బస్సు వీరిని ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో 108 అంబులెన్సు రాకపోవడం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడం ఆలస్యం కావడంతో అజయ్‌సాయి మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఎంఆర్‌పల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.



అజయ్‌సాయి మృతదేహం

గుత్తా మునిరత్నానికి పలువురి నివాళి

తిరుపతి(ఆటోనగర్), మే 6: రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుత్తా మునిరత్నం వర్ధంతి సందర్భంగా సోమవారం ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, డైరెక్టర్ వి.నాగరాజు, కమిటీ సభ్యులు కృష్ణమూర్తి నాయుడు, యువరాజు, మోహన్, ప్రసాద్, నందిని, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. ● రాస్ కేవీకేలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, రాము, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



'తిరుపతి అసెంబ్లీ'లో 84మంది హోం ఓటింగ్

తిరుపతి అర్బన్, మే 6: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సంఘం 87మందికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించింది. వీరిలో నడవలేని వయోవృద్ధులు 64మంది ఉండగా, ఒకరు మృతిచెందారు. అధికశాతం అంగవైకల్యం కలిగిన వారు 23 మంది ఉండగా, ఇద్దరి ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో ఒకరు వేలూరు ఆస్పత్రికి, మరొకరు సొంతూరుకు వెళ్లిపోయారు. దాంతో 84మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

ఆర్‌సీపురంలో..

రామచంద్రాపురం: మండలంలో తొమ్మిది మంది ఇంటినుంచే సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూర్తిగా కదలలేని స్థితిలో ఉన్న వారి కోరిక మేరకు వారి కుటుంబసభ్యుల చేత ఓటు వేయించారు.



గంగిరెడ్డిపల్లిలో వృద్ధురాలి చేత ఓటు వేయిస్తున్న అధికారులు

ప్రభుత్వ మద్యం వైసీపీ పరం!

● ఒక్కో షాపు నుంచి 15 కేసులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు

తిరుపతి(నేరవిభాగం), మే 6: ప్రభుత్వ మద్యం వైసీపీ పరం అవుతోందన్న విమర్శలొస్తున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఒక్కో షాపు నుంచి 15 కేసులు కావాలని డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు అధిక కమీషన్లకు ఆశపడి దుకాణాల్లోని సిబ్బంది కూడా వీరికి సహకరిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా వైసీపీవారిపై ఎటువంటి కేసులు పెట్టడం లేదని ప్రతిపక్ష నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సెబ్, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఎన్నికల సమయంలో అధికంగా మద్యం అమ్మరాదని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలు తిరుపతిలో అమలు కావడం లేదని కూడా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

రూ.25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్

కుప్పం, మే 6: కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ దాడులు జరిగాయి. భూమి రిజిస్ట్రేషన్ కోసం ఒక మహిళ నుంచి డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.25 వేలు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబు పట్టుబడ్డారు. తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ వివరాల మేరకు.. కుప్పానికి చెందిన షణ్ముగం వాణి కుప్పం మండలం కూర్మానిపల్లెకు చెందిన ఎం.రాజు నుంచి 1.60 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబు రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని ఆమె చెప్పడంతో రూ.25 వేలకు బేరం కుదుర్చుకున్నారు. ఈ విషయమై బాధితురాలు తిరుపతి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డబ్బు డాక్యుమెంట్ రైటర్ షణ్ముగానికి ఇస్తుండగా అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ ఆధ్వర్యంలో డీఎస్పీలు ప్రశాంతి, రవి, మనోహచారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని విచారించగా సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబుల సూచన మేరకే లంచం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 14400 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ సూచించారు.



పట్టుబడ్డ సొమ్ముతో జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబు, సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, డాక్యుమెంట్ రైటర్ షణ్ముగం

కుప్పం నియోజకవర్గంలో నేడు, రేపు నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం, మే 6: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళ, బుధవారాలలో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మొదటి రోజున శాంతిపురం, రెండవ రోజున కుప్పం, రామకుప్పం మండలాలలో రోడ్‌షోలు నిర్వహిస్తారు. అక్కడక్కడా జనాలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మంగళవారం సాయంత్రం 4.15 గంటలకు బెంగళూరు నుంచి కుప్పం చేరుకుంటారు. 6.45గంటలకు శాంతిపురం మండలం అనికెర క్రాస్, 7.30 సోగడబల్ల, 8.15 కెనమాకులపల్లె, 9 కడపల్లె, 9.30కు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలకు చేరుకుని రాత్రి బస చేస్తారు. బుధవారం ఉదయం 9గంటలకు రామకుప్పం మండలం బందార్లపల్లె, 9.30 పెద్దగరిగపల్లె, 10 పల్లికుప్పం, 10.30 పంద్యాలమడుగు, 11 పీఎంకే తాండా, 11.30 ననియాల, 12 89 పెద్దూరు, 12.30 ఆరిమానుపెంట, 1 రిజర్వ్‌డ్, 2 వీర్నమల, 3 బల్ల, 3.30 కుర్లపల్లె, 4 గోవిందపల్లె 5గంటలకు కుప్పం మండలం కంగుంది, 6 దాసేగానూరు, 7 తంబిగానిపల్లె, 8 పీఈఎస్ వైద్య కళాశాలకు చేరుకుని రాత్రి బసచేస్తారు.

రుయాలో రోగులకు, సహాయకులకు తప్పని తిప్పలు






రోగులను స్ట్రెచ్చర్‌లపై తీసుకువెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), మే 6: వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. నడవలేని రోగులను వైద్య పరీక్షలకు, వార్డులకు తీసుకువెళ్లాలంటే సిబ్బంది సరిపడ లేకపోవడంతో రోగుల సహాయకులు అవస్థలు పడుతున్నారు. నడవలేని రోగులను స్ట్రెచ్చర్‌లపై అతికష్టం మీద సహాయకులే తీసుకువెళ్లాల్సి వస్తుంది. ఆస్పత్రిలో ఓపీ నుంచి వార్డుకు, వార్డు నుంచి వైద్యపరీక్షా కేంద్రాలకు వెళ్లాలంటే 200 నుంచి 300 మీటర్లకు పైగా దూరం ఉండటం, అల్ట్రాసౌండ్, ఎక్సరే వార్డులకు తీసుకువెళ్లాలంటే కార్యాలయ భవనం మీదుగా తీసుకువెళ్లాలి. ఇక్కడ స్ట్రెచ్చర్‌లను తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గం గుంతలమయంగా ఉండటంతో దాని మీదుగా రోగులను తీసుకువెళ్లేందుకు వారి సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. అత్యవసర విభాగం ముందు కొన్ని రోజులుగా హాల్లోని ఫ్యాన్లు పనిచేయడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న ఒకటి రెండు ఫ్యాన్లను తీసి వైద్యాధికారుల గదుల్లో ఏర్పాటు చేయడంతో నిత్యం ఇక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది, రోగుల కోసం వేచి వుండే సహాయకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు చొరవచూపి ఇటువంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు స్కూటీల దగ్ధం

● రూ.2.60 లక్షల నష్టం

తిరుపతి(నేరవిభాగం), మే 6: బ్యాటరీ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నాలుగు స్కూటీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన సోమవారం ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద జరిగింది. తిరుపతి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కె.వెంకటరమణ వైద్యంకోసం ఈఎస్‌ఐ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడ చెట్టు కింద స్కూటీని ఆపి ఆస్పత్రిలోకి వెళ్లాడు. దానిపక్కనే జీవకోనకు చెందిన వై.సుబ్రహ్మణ్యం, లింగేశ్వరనగర్‌కు చెందిన రాజు, పాకాల మండలం తలారిపల్లికి చెందిన పి.నిరంజన్‌లు తమ స్కూటీలు ఆపి.. ఆస్పత్రి లోపలకివెళ్లారు. ఉదయం 11.30గంటలప్పుడు వెంకటరమణ స్కూటీలో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద శబ్దం వచ్చి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు పక్కనే వున్న మూడు స్కూటీలకూ అంటుకున్నాయి. దీంతో నాలుగు ద్విచక్ర వాహనాలూ దగ్ధమయ్యాయి. అగ్నిమాపక శాఖ అధికారులు లీడ్ ఫైర్ మేన్ శివరాం నేతృత్వంలో సిబ్బంది మనోజ్‌కుమార్, జయకిషోర్ రెడ్డి, పురుషోత్తం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2.60లక్షల నష్టం సంభవించిందని తిరుపతి అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వెంకటరమణ తీసుకొచ్చిన స్కూటీ.. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ పేరుపై ఉన్నట్లు చెప్పారు.



దగ్ధమైన స్కూటీలు

ప్రక్షాళన చేస్తామని.. పక్కన పెట్టేశారు

అటకెక్కిన యూడీఎస్ ప్రాజెక్టు - వర్షం రాకనే పొంగుతున్న డ్రైనేజీలు



గీతాంజలి స్కూల్ దగ్గర తరచుగా ఇదే పరిస్థితి

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతి నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు దాన్ని పూర్తిగా పక్కనపెట్టేయడం విమర్శలకు తావిస్తోంది. ముంబై తరహాలో అత్యంత సాంకేతిక విధానంతో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ (యూడీఎస్)ను తీసుకువస్తామని చెప్పినా ఐదేళ్లుగా దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పైలెట్ ప్రాజెక్టుగా తొలుత 10 కి.మీ డ్రైనేజీ విధానాన్ని మార్చి తర్వాత నగరమంతా విస్తరిస్తామన్నారు. ఈ మేరకు 2021 ఆగస్టు 25న ముంబై కన్సల్టింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అప్పటి కమిషనర్ గిరీష సమీక్షించారు. మీడియాకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీడియోలు చూపించి చేతులు దులుపుకున్నారు.

1994లోనే డిజైన్ చేశారు..

తిరుపతిలో యూడీఎస్ పథకాన్ని 1994లో డిజైన్ చేశారు. నగరాన్ని ఆరు కూడళ్లుగా విభజిస్తూ 1999లో టీడీపీ హయాంలో యూడీఎస్ నగరంలో ప్రారంభమైంది. ప్రధాన మురుగు కాలువ పొడవు 70.46 కి.మీ విస్తరించి ఉంది. 25వేల ఇళ్లకు డ్రైనేజీ కాలువలకు కనెక్ట్ అయివుంది. ప్రస్తుతం కార్పొరేషన్ లెక్కల ప్రకారం లక్షకుపైగా ఇళ్లు ఉన్నాయి. 30 శాతం ఇళ్లకు మాత్రమే యూడీఎస్ అనుసంధానమై ఉంది. జనాభా పెరగడం, యూడీఎస్ పైపుల సామర్థ్యం కన్నా ఎక్కువగా మురుగు ప్రవహించడంతో మ్యాన్‌హోల్స్ తెరుచుకుంటున్నాయి. తద్వారా తరచూ మురుగు రోడ్లపైకి వచ్చేస్తోంది. గతంలో వర్షం వస్తేనే యూడీఎస్‌లు పొంగేవి. ఇప్పుడు వర్షంతో పనిలేకనే పొంగుతున్నాయి. ఈ సమస్యపై స్పందన కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదులను చూస్తే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద రూ.90 కోట్లతో యూడీఎస్‌ను రీవ్యాంప్ చేసేందుకు అనుమతివ్వాలని కార్పొరేషన్ ప్రభుత్వాన్ని కోరినా అనుమతులు రాకపోవడంతో ఆగిపోయింది.

యూడీఎస్ కాలువల పొడవు

ఒక్కో ప్రధాన కాలువ దూరం	70.46 కి.మీ
అనుబంధ కాలువల దూరం	189.57 కి.మీ
మొత్తం కాలువల దూరం	260.03 కి.మీ

గొల్లవానిగుంటకు చేరుతున్న మురుగునీరు

తిరుపతిలో యూడీఎస్ సక్రమంగా లేకపోవడంతో రేణిగుంట రోడ్డులోని కాలువల ద్వారా మురుగునీరు పరమాచార్య రోడ్డు కల్వర్టుల ద్వారా గొల్లవానిగుంటకు చేరుతున్నాయి. వాస్తవానికి ఈ నీరు యూడీఎస్ పైపుల ద్వారా తూకివాకం పోవాల్సి ఉంటుంది. అలాకాకుండా 50 శాతం కాలువలు పొంగి గొల్లవానిగుంటకు చేరుతున్నాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ప్రధాని సభ ఏర్పాట్లు ముమ్మరం

కలికిరి, మే 6: అన్నమయ్య జిల్లా కలికిరి సమీపంలోని నగరిపల్లె సీఆర్పీఎఫ్ ప్రధాన ద్వారం ముందు ఈనెల 8వ తేదీ బుధవారం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సభా వేదిక నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. అదే విధంగా సభా స్థలికి సమీపంలోనే సైనిక్ స్కూల్ దగ్గర మూడు హెలీప్యాడ్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఒక హెలికాప్టర్ ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని దించేందుకు ప్రయత్నించగా, అప్పటికి హెలిప్యాడ్‌ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో సమీపంలోని సైనిక్ స్కూల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేశారు. అనంతరం అది అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయింది. మధ్యాహ్నానికి ఒక హెలీప్యాడ్ సిద్ధమైనట్లు సమాచారం పంపడంతో బెంగళూరు నుంచి మరో హెలికాప్టర్ ఇక్కడ ల్యాండ్ అయ్యింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్ రెండు గంటల అనంతరం తిరిగి బెంగళూరు వెళ్లిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ అధినేత నారా చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఈ సభకు హాజరు కానున్న విషయం తెలిసిందే. మంగళవారం నాటికల్లా హెలీప్యాడ్ ప్రాంతంతోపాటు సభా ప్రాంగణమంతా ఎస్పీజీ, ఎస్ఎస్‌జీల ఆధీనంలోకి వెళ్లనున్నాయి.

భద్రతా ఏర్పాట్లపై సుదీర్ఘ సమావేశం : ప్రధానమంత్రితో పాటు ఇతరం వీవీఐపీలు హాజరు కానున్న బుధవారం నాటి సభకు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. రెండు రోజులపాటు ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీ అధికారులు పలు సూచనలు జారీ చేశారు. అవన్నీ ఎంత వరకూ నెరవేరాయన్న అంశాలపై సోమవారం రాత్రి ఏడున్నర వరకూ స్థానిక జేఎన్టీయూ కళాశాలలో పోలీసు అధికారులు సమీక్షించారు.డీఐజీ విజయారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కడప, సత్యసాయి, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాలకు చెందిన 10 మంది ఎస్పీలు హాజరైనట్లు సమాచారం. అన్ని రకాల ఏర్పాట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని కోణాల నుంచి తీసుకోవలసిన పలు రకాల జాగ్రత్తల గురించి చర్చించినట్లు సమాచారం.

ఆర్యవైశ్యులను అణగదొక్కిన జగన్: దూండి

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్లలో ఆర్యవైశ్యులను అణగదొక్కడం, ఇబ్బంది పెట్టడమే జగన్ కర్తవ్యంగా ఉంది. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఉనికి పోగొట్టడమే లక్ష్యంగా జగన్ వైఖరి ఉంది' అని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు దూండి రాకేశ్ ఆరోపించారు. వైసీపీకి ఆర్యవైశ్యులంటే ఎందుకంత చులకన అని ఆయన ప్రశ్నించారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో మరికొందరికి చోటు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీలో మరో ఏడుగురికి చోటుదక్కింది. కార్యనిర్వాహక కార్యదర్శులుగా జీవీఎన్ శేఖర్‌రెడ్డి (కోవూరు), కసుకుర్తి హనుమంతరావు(గుంటూరు పశ్చిమ), మన్నెం శ్రీనివాసులు నాయుడు(తిరుపతి), కొండవీటి భావన(అనంతపురం), కార్యదర్శులుగా గుల్లపల్లి సుదర్శన్‌రావు(కురుపాం), తోట రత్నం(విశాఖ పశ్చిమ), రాయల్ మురళీ (అనంతపురం)ను, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా అనిల్ చౌదరి (కళ్యాణదుర్గం)ని నియమిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను చింతలపూడి ఎన్నికల సమన్వయ కర్తగా నియమించారు.

వైసీపీ అరాచకాలపై ఎన్నారై మహిళల సమరశంఖం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలపై మేము సైతం అంటూ ఎన్నారై మహిళలు సమరశంఖం పూరించారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ వర్జీనియాలో ఈ మేరకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నారై మహిళా నేతలు పాలడుగు సాయిసుధ, గోరంట్ల మంజూష, మన్నవ అనిత, పూసల సింధు, పారుపల్లి శాంతి, మండవ నీలిమ తదితరులు మాట్లాడుతూ, స్వస్థలాలకు వెళ్లగలిగిన వారు టీడీపీకి ఓటేసి, చంద్రబాబు విజయానికి దోహదపడాలని కోరారు.

విట్ పరీక్షలు వాయిదా వేయాలి: వర్ల

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్త ఓటర్లుగా నమోదై, తమిళనాడులోని విట్ యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులకు మే 14న పెడుతున్న పరీక్షలను వాయిదా వేయాలని టీడీపీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. మే 13న ఓటు వేసి, మరుసటి రోజే తమిళనాడు వెళ్లి పరీక్షలు రాయడం కష్టమని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల పరీక్షలను కొన్ని రోజులు వాయిదా వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో టీడీపీ నేతల బృందం సీఈవోను కలిసి, పలు అంశాలపై ఫిర్యాదులిచ్చారు.

అరెస్ట్ భయంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

మద్దిపాడు, మే 6: పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పోలీస్ వాహనం ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గార్లపేట గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకటేష్ మూడురోజుల క్రితం ట్రాక్టర్‌పై వెళుతుండగా కనిగిరి మండలం ఎనిమిరెడ్డిపల్లెకు చెందిన దంపతులు బైక్‌పై వస్తూ ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. వారి మధ్య మాటామాట పెరగడంతో వెంకటేష్‌పై దంపతులతో పాటు మరికొందరు దాడి చేశారు. వెంకటేష్ ఆదివారం సాయంత్రం కొందరు యువకులను వెంటబెట్టుకొని ఎనిమిరెడ్డిపల్లెకు వెళ్లి తనను కొట్టిన దంపతులపై తిరిగి దాడి చేశాడు. గ్రామస్థులు వారిలో ముగ్గురిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని తీసుకుని వస్తుండగా వెంకటేష్ తనను అరెస్ట్ చేసేందుకు వస్తున్నారని భయపడి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు.గాయాలతో ఉన్న వెంకటేష్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.పరిస్థితి విషమంగా వుంది.

'కోడ్'కు జెల్లకొట్టి..

- 61 మంది సీనియర్ వైద్యుల ఆకస్మిక బదిలీ
- ఈసీ అనుమతించడంపై విమర్శలు



అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైద్యులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు.. ఆప్షన్లు అడగలేదు.. కానీ కోడ్ అమలులో ఉండగానే ఆకస్మాత్తుగా 61మంది సీనియర్ వైద్యుల్ని ప్రభుత్వం బదిలీ చేసింది. వైద్యులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా.. వారి మెడమీద కత్తి పెట్టి.. బదిలీ స్థానాల్లో చేరాల్సిందేనని ఒత్తిడి తెస్తోంది! ముందస్తు కార్యాచరణ లేకుండా ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఏడాది కొత్త మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేసేయడం, ఇంతవరకు వైద్యుల నియామకం చేపట్టకపోవడమే ఇందుకు కారణం. వాస్తవానికి 17 మెడికల్ కాలేజీలూ 2021 నాటికి పూర్తి చేస్తామని జగన్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రగల్భాలు పలికినా.. ఇప్పటికీ వాటి నిర్మాణం పూర్తి కాలేదు. ఆరు నెలల క్రితం అతి కష్టం మీద 5కాలేజీల్లో అడ్మిషన్లు పూర్తి చేసినా.. నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరో 5కాలేజీల్లో అడ్మిషన్లకు కసరత్తు చేస్తున్నారు. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కాలేజీల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికీ ఆయా కాలేజీల్లో పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. దీంతో 150 ఎంబీబీఎస్ సీట్లు కాస్త 100సీట్లకు ప్రభుత్వమే కుదించుకుని అడ్మిషన్లు చేసేద్దామని హడావుడి చేస్తోంది. డీఎంఈ అధికారులు కూడా ముందూవెనుకా ఆలోచించకుండా ప్రభుత్వం చెప్పిందే గుడ్డిగా ఫాలో అయిపోతున్నారు. రెండోఫేజ్‌లో అడ్మిషన్ల కోసం ప్రయత్నం చేస్తున్న పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్యుల నియామకానికి డీఎంఈ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ప్రభుత్వంపై నమ్మకం లేక వైద్యులెవ్వరూ కొత్త కాలేజీల్లో చేరడానికి రాలేదు. వైద్యసిబ్బంది లేకపోతే అడ్మిషన్లు నిలిచిపోతాయి. కానీ అనుమతుల కోసం దరఖాస్తు చేయడంతో ఎన్ఎంసీకి తనిఖీలకు సిద్ధమైపోయింది. కొత్త నియామకాలు చేపట్టడంలో విఫలమైన ప్రభుత్వం.. పాత వారినే కొత్త కాలేజీలకు పంపించేద్దామంటూ వైద్యుల ఆకస్మిక బదిలీలలకు తెరతీసింది. బదిలీల్లో భాగంగా పాడేరు మెడికల్ కాలేజీకి విశాఖ ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి, మదనపల్లెకి తిరుపతి నుంచి, మార్కాపురానికి విజయవాడ, గుంటూరు నుంచి, ఆదోనికి కర్నూలు మెడికల్ కాలేజీల సిబ్బందిని బదిలీ చేసేశారు. ఒక ఉద్యోగిని ఒక చోటు నుంచి మరో చోటుకు బదిలీ చేసే సమయంలో సదరు ఉద్యోగి నుంచి ఆప్షన్ తీసుకోవాలి. లేదంటే కనీస సమాచారం ఇవ్వాలి. డీఎంఈ అధికారులు కనీసం ఈ నిబంధనలు పాటించకుండా ఇలా ఆకస్మాత్తుగా 61 మంది సీనియర్ వైద్యులను కొత్త కాలేజీలకు బదిలీ చేసేశారు. ప్రొఫెసర్లు 12 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 15, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 34 మందిని బదిలీ చేసేశారు.

పీక మీద కత్తిపెట్టి..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే వైద్యులతో ఫుట్‌బాల్ ఆడుకుంటోంది. ఐదేళ్ల నుంచి ప్రభుత్వం చేసిన బదిలీల పుణ్యమా అని వైద్యులు కుటుంబాలను వదిలేసి నెలల తరబడి వివిధ జిల్లాల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా బదిలీ చేసినవారిలో కొంత మందికి అనారోగ్య సమస్యలు, మరికొంత మందికి ఇతరత్రా అనేక సమస్యలున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండానే ఆకస్మిక బదిలీలు చేసేశారు. సోమవారం ఉదయం చాలామంది వైద్యులు డీఎంఈ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను విన్నవించారు. డీఎంఈ డాక్టర్ నరసింహం మాత్రం.. ఇదంతా తాత్కాలిక బదిలీలేనని, కొన్ని రోజుల తర్వాత వెనక్కి పంపించేస్తామని చెప్పుకొచ్చారు. అయితే, ఆ విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొనాలని వైద్యుల కోరగా సమాధానం లేదు. కాగా, ఫేజ్- 2 లో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లకు డీఎంఈ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీల విషయానికి వచ్చే సరికి కేవలం నాలుగు కాలేజీలకు వైద్యులను బదిలీలు చేశారు. పులివెందుల కాలేజీకి మాత్రం ఒక్కరిని కూడా బదిలీ చేయలేదు. పులివెందుల్లో కూడా వైద్య సిబ్బంది కొరత ఉంది. ఇప్పుడు కడప లేదా అనంతపురం నుంచి వైద్యులను పులివెందుల మెడికల్ కాలేజీకి బదిలీ చేస్తే ఎన్నికల సమయం కనుక ప్రభుత్వానికి నెగటివ్ అవుతుందని, ప్రత్యక్షంగా జగన్‌కు నష్టం వాటిల్లుతుందని.. ఆ కాలేజీకి కొత్త వారిని బదిలీ చేయలేదు. మిగిలిన నాలుగు కాలేజీలకు మాత్రం వైద్యులను బదిలీ చేసేశారు.

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ దర్యాప్తు

సిఫార్సు చేసిన లెఫ్టినెంట్ గవర్నర్.. కేంద్ర హోం శాఖకు లేఖ



- ఉగ్రవాది విడుదలకు ఖలిస్థాన్ సంస్థ నుంచి నిధులు తీసుకున్నట్టు ఆరోపణలు

న్యూఢిల్లీ, మే 6: మద్యం విధానం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ, ఈడీ విచారణలను ఎదుర్కొంటున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇకపై మరో అంశంలో ఎన్ఐఏ దర్యాప్తును ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఖలిస్థాన్‌కు అనుకూలంగా ఉండే నిషేధిత తీవ్రవాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) నుంచి రాజకీయ విరాళాలు తీసుకున్నారంటూ అందిన ఫిర్యాదుపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖలిస్థాన్ తీవ్రవాది దేవేంద్ర పాల్ భుల్లర్‌ను విడుదల చేయించడంతో పాటు, ఖలిస్థాన్ సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆ తీవ్రవాద సంస్థ నుంచి 16 మిలియన్ డాలర్లు (సుమారు రూ.135 కోట్లు) తీసుకున్నట్టు వరల్డ్ హిందూ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆషూ మోగియా గతంలో ఫిర్యాదు చేశారు. దాన్ని ఆధారం చేసుకొని సక్సేనా ఈ లేఖ రాశారు. 2014 నుంచి 2022 వరకు ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్థాన్ గ్రూపుల నుంచి 16 మిలియన్ డాలర్లు విరాళాలుగా అందాయని పేర్కొంటూ ఖలిస్థాన్ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నున్ విడుదల చేసిన వీడియోను కూడా ఈ లేఖలో ప్రస్తావించారు. ప్రొఫెసర్ భుల్లర్‌ను జైలు నుంచి విడుదల చేయాలని ఆప్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రపతికి సిఫార్సు చేసిందని ఆ లేఖలో రాశారు. 1993లో ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాంబు దాడి జరిగిన ఘటనలో భుల్లర్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఆ సంఘటనలో తొమ్మిది మంది మరణించగా, 31 మంది గాయపడ్డారు. జర్మనీలో ఉన్న అతడ్ని 1995లో తీసుకువచ్చి అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతడు తిహాడ్ జైలులో ఉన్నాడు. ట్రయల్ కోర్టు అతనికి 2001లో మరణశిక్ష విధించగా, 2014లో ఉన్నత న్యాయస్థానం దాన్ని యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గించింది. అతని విడుదల కోసం కేజ్రీవాల్ న్యూయార్క్‌లోని గురుద్వారా రిచ్‌మాండ్ హిల్స్‌లో వేర్పాటువాదులను కలిసినట్టు, వారి నుంచి నిధులు తీసుకున్నట్టు ఫిర్యాదు అందినందున ఎన్ఐఏ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేశారు. న్యూయార్క్ గురుద్వారాలో ఖలిస్థాన్ అనుకూల వ్యక్తులతో కేజ్రీవాల్ భేటీ అయిన ఫొటోను ఆప్ మాజీ కార్యకర్త మునీష్ కుమార్ రైజాదా అప్పట్లో ట్విటర్‌లో పెట్టారు. దాన్ని కూడా లేఖలో పేర్కొన్నారు. వీటన్నింటిపై ఫోరెన్సిక్ పరీక్షలతో పాటు, సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు.

మరో కుట్ర

దీనిపై ఆప్ స్పందిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ బీజేపీ ఏజెంటని, ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాల్లో ఆ పార్టీ ఓడిపోతుందని తెలిసి కేజ్రీవాల్‌పై మరో పెద్ద కుట్రకు తెర తీశారని వ్యాఖ్యానించింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇలాంటి ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ నాయకుడు, ఢిల్లీ మంత్రి సౌరబ్ భరద్వాజ్ చెప్పారు.

చైనా సీ డ్రాగన్.. ఫ్యూజియాన్

విమానవాహక యుద్ధ నౌక సీ ట్రయల్స్ ప్రారంభం



బీజింగ్, మే 6: సంఖ్యాపరంగా ఇప్పటికే ప్రపంచంలోనే అతి పెద్ద నౌకాదళ శక్తిగా ఉన్న చైనా.. తన బలాన్ని ఇతోధికంగా పెంచుకునే క్రమంలో మూడో విమాన వాహక యుద్ధనౌక ఫ్యూజియాన్‌ను రంగంలోకి దించింది! ప్రపంచంలోనే అతిపెద్దదైన అమెరికా విమానవాహక యుద్ధ నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'లో మాత్రమే ఉన్న 'ఈమాల్స్ (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్)'తో చైనా దీన్ని రూపొందించడం విశేషం. ప్రపంచ కార్మికులంతా మేడే సంబరాలు జరుపుకొంటున్న మే ఒకటో తేదీన.. ఈ ఫ్యూజియాన్ సీ ట్రయల్స్‌ను ప్రారంభించింది. ట్రయల్స్‌లో భాగంగా.. ఆ యుద్ధనౌకలోని ప్రొపల్షన్, విద్యుత్ వ్యవస్థల పనితీరును, స్థిరత్వాన్ని చైనా రెండేళ్లపాటు పరీక్షించి, ఐదేళ్లలో తన నౌకాదళానికి అందుబాటులోకి తేనుంది. దీని బరువు దాదాపు 80 వేల టన్నులు. పొడుగు 1036 అడుగులు. ఫ్యూజియాన్ కన్నా ముందు.. చైనా వద్ద రెండు విమాన వాహక యుద్ధ నౌకలున్నాయి. మొదటిది.. లియావోనింగ్. 1998లో చైనా దీన్ని ఉక్రెయిన్ నుంచి కొనుగోలు చేసి దేశీయంగా రీఫిట్ చేసుకుంది. దాంట్లో తనకు కావాల్సిన విధంగా మార్పుచేర్పులు చేసుకుంది. ఆ తర్వాత మళ్లీ రెండు దశాబ్దాలకు.. 2019లో షాంగ్‌డాంగ్ అనే దేశీయ విమాన వాహక యుద్ధనౌకను తన నేవీకి అందుబాటులోకి తెచ్చింది. ఆ రెండింటికన్నా సాంకేతికంగా అత్యంత అధునాతనమైనది ఈ ఫ్యూజియాన్ యుద్ధ నౌక. అత్యంత అధునాతనమైన 'ఈమాల్స్'తో చైనా మూడో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను రంగంలోకి దించడం భారత్‌కు ఆందోళన కలిగించే విషయమే.

ఇఫ్కోకు భూ కేటాయింపులు సక్రమమే

- హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలో యూరియా ప్లాంట్ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను ఇఫ్కో సంస్థ వ్యవసాయ ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు వినియోగించడాన్ని హైకోర్టు సమర్థించింది. ఎరువుల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతి నిరాకరించడంతో కిసాన్ ఎస్ఈజెడ్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధంగా, హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవని పేర్కొంది. ప్రస్తుత కేసులో రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చినందున తాము కలగజేసుకోలేమని స్పష్టం చేసింది. కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూమిగా చెప్పబడుతున్న 1,009.91 ఎకరాలతో ఆలయానికి ఏ సంబంధం లేదని, దీనిని ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ ఫిబ్రవరిలో హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. రైతుల ప్రయోజనాల నిమిత్తం ఎరువుల ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున ఇఫ్కో కోసం చేసిన భూకేటాయింపులు ప్రజా ప్రయోజనం నిర్వచనం పరిధిలోకి వస్తాయని పేర్కొంది. ప్రైవేటు ప్రయోజనం కోసం ప్రభుత్వం భూములు కేటాయించిందన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. ఇఫ్కోకు భూకేటాయింపుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్విస్ ఛాలెంజ్ విధానం అనుసరించి ఉండాల్సిందన్న పిటిషనర్ల వాదనపై అభ్యంతరం తెలిపింది. ఇఫ్కోకు బహిరంగ వేలం ద్వారా భూములు కేటాయించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చుతూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. యూరియా ప్లాంట్ ఏర్పాటు కోసం నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి చెందిన 1009 ఎకరాలతో పాటు కొడవలూరు మండలం పరిధిలోని బొడ్డవారిపాలెం, రేగడిచెలిక, రాచర్లపాడు, తలమంచి తదితర గ్రామాల రైతులకు చెందిన పట్టా భూములు కలిపి మొత్తం 2776 ఎకరాలను ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్(ఇఫ్కో)కు ఇచ్చారు. యూరియా, అమోనియా ప్లాంట్ ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదని, భూకేటాయింపల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ కొడవలూరు మండలం అప్పటి జడ్పీటీసీ సభ్యుడు ఈ శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు 2017లో హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యవహారాన్ని సీబీఐ చేత దర్యాప్తు చేయించాలని అభ్యర్థించారు. మరోవైపు తమకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే భూములు సేకరించి ఇఫ్కోకు కేటాయించారని, తమకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కే సుశీలమ్మ, మరో 120 మంది పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని వెల్లడించింది. పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు మేరకే కనిగిరి రిజర్వాయర్ నుంచి కోకాకోలా సంస్థ నీటిని వాడుకుంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

ఫిఫో విధానంలో బకాయిలు చెల్లించండి

- సీఈవోకు సబ్‌కా కాంట్రాక్టర్ల ఫిర్యాదు

విజయవాడ, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పారదర్శకంగా బిల్లులు చెల్లించడం లేదని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్‌కా) అధ్యక్షుడు కొండా రమేష్, ఎస్.విజయకుమార్ సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్(ఫిఫో) విధానంలో బిల్లులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈసీ ఆదేశించినా.. మార్చి నెలలో ఫిఫో విధానంలో బిల్లులు చెల్లించలేదన్నారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. సంబంధిత శాఖల నుంచి వివరణ కోరతామని, వారిచ్చిన సమాధానం ప్రాతిపదికగా విచారణ జరుపుతామని సీఈవో హామీ ఇచ్చినట్టు సబ్‌కా ప్రతినిధులు తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): పేద, సామాన్య మధ్య తరగతి వర్గాల ప్రజల ఆస్తులను వివాదాల్లోకి నెట్టే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. సామాన్యుల ఆస్తుల పరిరక్షణకు సంకటంగా మారే ఈ చట్టం అమలుకు జగన్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేయడం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే హడావుడిగా ఈ యాక్ట్‌ను అమలు చేయాలంటూ సంబంధిత అధికారులకు ఉత్తర్వులివ్వడం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఏపీలో అరాచక, అవినీతి పాలన సాగుతుందనే విషయం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఐదేళ్ల తర్వాత తెలిసిందా? అని ప్రశ్నించారు. ఆయన ఇప్పుడే నిద్ర లేచినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఏపీకి పదే పదే ద్రోహం చేస్తున్న బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని రామకృష్ణ పేర్కొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

వీళ్లిద్దరిలో ఎవరు?





కన్నడ సూపర్‌స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమా గురించి రోజుకో వార్త వినిపిస్తోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకొనే ఈ చిత్రం జూన్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. సినిమాలో హీరో చెల్లెలు పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉండడంతో ఆ పాత్రకు ఎవరిని ఎంపిక చేయాలా అనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు దర్శకనిర్మాతలు. నయనతార ఆ పాత్ర పోషించనున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఇంకో పేరు వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే పాన్ ఇండియా సినిమా కనుక చెల్లెలు పాత్రకు నయనతార కాకుండా కృతి సనన్‌ను తీసుకుంటే ఎలా ఉంటుందా అనే కొత్త ఆలోచన మొదలైనట్లు తెలుస్తోంది. నయనతార సౌత్ వరకూ ఓకే కానీ బాలీవుడ్‌లోని టాప్ హీరోయిన్లలో కృతి ఒకరు కనుక ఆమెను తీసుకుంటే సినిమాకు మరింత ప్లస్ అవవచ్చు అని ఆలోచిస్తున్నట్లు సమాచారం. నయతార, కృతి.. వీరిద్దరిలో ఎవరు అనే విషయం త్వరలోనే తేలిపోతుందని అంటున్నారు. ఇక యశ్ సరసన కియారా నటిస్తున్న సంగతి తెలిసిందే.

మంచి చిత్రాన్ని అందించాలని...



తమిళంలో చిన్న చిత్రంగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటూ పెద్ద విజయాన్ని అందుకున్న చిత్రం 'రంగోళి'ని తెలుగులో 'సత్య'గా డబ్ చేశారు. హమరేశ్, ప్రార్థన సందీప్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఆడుకాలం మురుగదాస్, సాయిశ్రీ, అక్షయ కీలక పాత్రలు పోషించారు. వాలి మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. తెలుగు వర్షన్‌కు శివ మల్లాల నిర్మాత. ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన 'సత్య' ఈ నెల 10న తెలుగులో విడుదల అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో 8 మంది దర్శకులు కలసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత శివ మల్లాల మాట్లాడుతూ "నిర్మాతగా ఒక ప్రేక్షకులకు ఒక మంచి చిత్రాన్ని అందించాలని ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నా" అని చెప్పారు. దర్శకుడు వాలి మోహన్ దాస్ మాట్లాడుతూ "కుటుంబం కథా చిత్రంగా వస్తున్న 'సత్య'ను తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి" అని కోరారు.

దేవర... ఎన్టీఆర్‌కు స్పెషల్



'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న జూనియర్ ఎన్టీఆర్ చిత్రం కావడంపై 'దేవర పార్ట్ వన్' మీద భారీ అంచనాలు ఉన్నాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇటీవల ఎన్టీఆర్ 'అభిమానులు కాలర్ ఎగరేసుకునేలా చిత్రం ఉంటుంది' అని కామెంట్ చేసి అభిమానుల్లో జోష్ పెంచారు. తాజాగా ఓ సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు, ఆయన అభిమానులకు ఈ సినిమా కచ్చితంగా ప్రత్యేకంగా ఉంటుంది. త్వరలో అప్‌డేట్స్ వస్తాయి' అన్నారు. ఈ నెల 20 ఎన్టీఆర్ బర్త్‌డే కావడంతో ఆ రోజు 'దేవర చిత్రం నుంచి సర్‌ప్రైజ్ ఉంటుందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 'దేవర' చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరుగుతోంది. ఎన్టీఆర్ మాత్రం ముంబైలో 'వార్ 2' షూటింగ్‌లో ఉన్నారు.

ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు



'హుషారు', 'జాంబీ రెడ్డి', 'రావణాసుర' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు దక్షా నగార్కర్. తొమ్మిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా దక్షా నటించింది కేవలం ఐదు చిత్రాలు మాత్రమే. ఇటీవలే ఆమె కొన్ని అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. కోలుకున్నాక ఈ విషయమై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "గడిచిన కొద్ది రోజులు నరకప్రాయంగా తోచాయి. ఇలా ఆస్పత్రి బెడ్‌లో చికిత్స పొందుతూ ఉండటం ఎంతో బాధాకరం. నా వెన్నెముకకు ఇప్పటికే రెండు సార్లు మత్తు మందు ఇచ్చారు. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు. ఈ పరిస్థితుల నుంచి కోలుకోవడం ఎంతో కష్టంగా ఉన్నా.. కుటుంబ సభ్యుల అభిమానం, కేరింగ్ ఆరోగ్యాన్ని మెల్లిమెల్లిగా కుదుటపడేలా చేస్తున్నాయి. వారు కురిపించిన ప్రేమ వల్ల ఎంతటి నొప్పినైనా భరించే శక్తి వచ్చింది. కంటికి కనిపించని గాయాలను మాయం చేసే అద్భుత గుణం ప్రేమకు ఉంది. కుటుంబ సభ్యుల ప్రేమ ఈ విషయాన్ని రుజువు చేసింది. నేను అందరికీ చెప్పేదొక్కటే.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. అలాగే మీ చుట్టూ పాజిటివ్ వైబ్స్‌ను పెంచే రిలేషన్స్‌తో ఎక్కువ సమయం గడపండి" అని పేర్కొన్నారు.

తెలుగు, తమిళంలో అగ్ర హీరోల చిత్రాల్లో నటించి వరుస విజయాలు అందుకున్న నటి జ్యోతిక. కెరీర్ పీక్ టైమ్‌లోనే నటుడు సూర్యని పెళ్లి చేసుకుని సినిమాల్లో నటించడం తగ్గించారు. అప్పుడప్పుడు నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో ప్రేక్షకులను పలకరించే ఆమె.. బాలీవుడ్ చిత్రం శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్'లో కీలక పాత్రను పోషించారు. ఈ నెల 10న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా జ్యోతిక మీడియాతో ముచ్చటించారు.

ఆ విషయంలో మార్పు రావాలి



"నాకు వాస్తవానికి దగ్గరగా ఉండే పాత్రల్లో నటించడం ఇష్టం. ఇందులో నేను టీచర్‌గా నటించాను. ఒక ఫ్రెండ్‌గా, తల్లిగా, టీచర్‌గా శ్రీకాంత్ పాత్ర అనుకున్నది చేయడానికి నేను సహకరిస్తాను. నా కెరీర్‌లో నేను చేసిన పాత్రల్లో హృదయానికి బాగా చేరువైన రోల్ ఇది. పుట్టుకతోనే అంధుడిగా పుట్టిన శ్రీకాంత్ అనే ఒక సాధారణ వ్యక్తి, వ్యవస్థగా మారడమే ఈ సినిమా కథాంశం. విద్యార్థిగా, వ్యాపార వేత్తగా శ్రీకాంత్ జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లకు ఏ విధంగా సమాధానం చెప్పాడో సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. ఈ బయోపిక్‌లో రాజ్‌కుమార్ రావు నటన అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. పాత్ర కోసం ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా అద్భుతం. ఈ సినిమా సెట్స్‌కు అప్పుడప్పుడు 'శ్రీకాంత్' మూవీ రియల్ లైఫ్ క్యారెక్టర్ శ్రీకాంత్ బొల్లా వచ్చేవారు. తెలుగువాడైన శ్రీకాంత్ బొల్లా జీవితం నిజంగా ఒక ఇన్స్పిరేషనల్ జర్నీ. ఈ సినిమా విద్యార్థులకు కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చనే నమ్మకాన్ని కల్పిస్తుంది. అలాగే, ఇందులోని సన్నివేశాలు యూత్‌ను, కుటుంబాలను విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇక, ఎక్కడచూసినా సినిమాల్లో మహిళా సాధికారత గురించి చర్చ నడుస్తోంది. ఆ విషయంలో మార్పు రావాలి. ప్రత్యేకించి ఉమెన్ ఓరియెంటెడ్ చిత్రాలు తీయక్కర్లేదు. కథలోనే మహిళలకు సమాన అవకాశం ఉన్న పాత్రలు సృష్టిస్తే సరిపోతుంది" అని చెప్పారు.